మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 220 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad







## పదేళ్లు పట్టించుకోనివారి ఉచ్చులో పడొద్దు

**అన్నగా చెబుతున్నా.. 'గ్రూప్-1 మెయిన్స్' రాయండి**

**బంగారు అవకాశాన్ని కోల్పోకండి : అభ్యర్థులకు సీఎం విజ్ఞప్తి**

- ఆందోళనలు విరమించాలి
- పోలీసు డ్యూటీ మీట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- నిరుద్యోగులపై లాఠీచార్జీ, కేసులు వద్దని పోలీసులకు సూచన

హైదరాబాద్, (ప్రజా మంటలు): గ్రూప్-1 విద్యార్థులు ఆందోళనలు విరమించి పరీక్షలకు సిద్ధం కావాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మోసగాళ్ల మాటలు విని నిరుద్యోగులు మోసపోవద్దని కోరుతున్నానని అన్నారు. ఆందోళన చేస్తున్న విద్యార్థుల పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించవద్దని ఆదేశించారు. నిరుద్యోగుల పట్ల మానవత్వంతో మెలగాలని కోరుతున్నానని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని పోలీస్ అకాడమీలో పోలీస్ డ్యూటీ మీట్ ముగింపు కార్యక్రమం జరగ్గా, ముగింపు కార్యక్రమానికి

మిగతా 2లో..

## త్యాగాల చరిత్ర గాంధీ కుటుంబాలది

వార్తా 2లో..

దోపిడీ చేసిన చరిత్ర కెసిఆర్ కుటుటంబానిది

హైడ్రా ఆక్రమణదారుల్లో అంకుశంలా పనిచేస్తోంది

రాజీవ్ సద్భావనా యాత్రలో సిఎం రేవంత్ నిప్పులు

## విశాఖ శారద పీఠానికి భూ కేటాయింపు రద్దు

- వైకాపా ప్రభుత్వం ఇచ్చిన స్థలం అనుమతిని నిలిపివేస్తూ ఉత్తర్వులు

2లో..





## జీవో నం. 29 రద్దుపై విద్యార్థుల ఆందోళన

**- చలో సెక్రెటరియట్‌ను అడ్డుకున్న పోలీసులు**

హైదరాబాద్, (ప్రజా మంటలు): గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళనతో అశోక్‌నగర్‌లో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. జీవో నెంబర్ 29ని రద్దు చేసి జీవో నెం 55ను అమలు చేయాలంటూ నిరుద్యోగులు శనివారం ఆందోళనలకు పిలుపునిచ్చారు. వీరి నిరసనకు కేంద్రమంత్రి బండి సంజయ్ మద్దతు తెలిపారు. బండి సంజయ్‌తో పాటు బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున అశోక్‌నగర్ చేరుకుని ఆందోళన చేస్తున్న అభ్యర్థులకు మద్దతు తెలుపుతూ నిరసనకు దిగారు. ఈ క్రమంలో ఛలో సెక్రటేరియట్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆందోళన కాస్త తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఎట్టిపరిస్థితుల్లోనూ సెక్రటేరియట్‌కు వెళ్లి తీరతామని బండి సంజయ్ స్పష్టం చేశారు. దీంతో పెద్ద ఎత్తున పోలీసులు అక్కడకు చేరుకుని కేంద్రమంత్రిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. చివరకు బండి సంజయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయంలో విద్యార్థులకు, పోలీసులకు మధ్య తీవ్ర తోపులాట చోటు చేసుకుంది. అశోక్‌నగర్ నుంచి ఛలో సెక్రటేరియట్‌కు బయలుదేరిన బండి సంజయ్‌ను

మిగతా 2లో..

## ఆదివాసీ హక్కులను హరిస్తున్నారు

**- అధికారంలోకి వస్తే రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తేస్తాం - గిరిజనుల మూలాల బోధనలో మన విద్యావిధానం విఫలం- కులగణన సమాజానికి ఎక్స్-రే వంటిది - 'సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్' సభలో రాహుల్ గాంధీ**



రాంచీ(ప్రజా మంటలు): త్వరలో ఝార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలోనే రాంచీలో ఏర్పాటు చేసిన 'సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్' సభలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రంలోని ఎన్డీఏ సర్కారుపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆదివాసీల గురించి బోధించడంలో మన విద్యావ్యవస్థ విఫలమైందని వ్యాఖ్యానించారు. వారి హక్కులను హరిస్తున్నారు. "గిరిజనుల చరిత్ర, వారసత్వం, సంస్కృతి, వైద్య విధానాలను భాజపా నాశనం చేసేందుకు ప్రయత్నిస్తోంది. దళితులు, గిరిజనులు, వెనకబడిన వర్గాల వారిని గౌరవిస్తున్నట్లు ప్రధాని మోదీ చెబుతున్నారు. కానీ, ఆయన మీ హక్కులను హరిస్తున్నారు. సంస్థల నుంచి బహిష్కరిస్తున్నారు. ఆర్థిక శాఖలో ఒక్క దళితుడు, గిరిజనుడు లేడు. ఆదివాసీల మూలాల గురించి బోధించడంలో మన విద్యావిధానం విఫలమైంది. మోదీ సర్కార్ రాజ్యాంగాన్ని అన్ని రకాలుగా నాశనం చేసేందుకు ప్రయత్నిస్తోంది. దాన్ని రక్షించాల్సిన అవసరం ఉంది" అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. కులగణన సమాజానికి ఎక్స్-రే

మిగతా 2లో..

## నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం

**- ప్రతి నియోజకవర్గానికి 4 వేల గృహాలు**

**- నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లే ప్రభుత్వ లక్ష్యం**

**- మంత్రి పొంగులేటి**




హైదరాబాద్, (ప్రజా మంటలు): ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక ప్రకటన చేశారు. ఈ నెలాఖరులోగా మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ప్రతి నియోజక వర్గానికి 3,500 నుంచి 4,000 గృహాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. రానున్న నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పార్టీలకు సంబంధం లేకుండా పేదలకు అందజేస్తామని తెలిపారు.

## రైల్వే రిటైర్డు ఉద్యోగులు తీపికబురు

- రిక్రూట్‌మెంట్‌లో వారికీ అవకాశం
- రైల్వే శాఖ కీలక నిర్ణయం..!

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): సిబ్బంది కొరతను అధిగమించేందుకు రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా పలు జోన్లలో 25వేల ఉద్యోగాలకు రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను ప్రారంభించింది. అయితే, వీటికి దరఖాస్తు చేసుకునేందుకు రిటైర్డ్ రైల్వే ఉద్యోగులకు కూడా అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అధికారిక వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ కొత్త నిబంధన కింద.. సూపర్‌వైజర్ల నుంచి ట్రాక్‌మెన్ వరకు పలు ఉద్యోగాలకు రైల్వే నుంచి రిటైర్ అయిన ఉద్యోగులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే, 65 ఏళ్ల లోపు వారు మాత్రమే ఇందుకు అర్హులని చెప్పినట్లు సమాచారం. రెండేళ్ల పదవీకాలానికి గానూ వీరిని నియమించుకోనున్నారు. అవసరమైతే పదవీకాలాన్ని పొడిగించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం, ఇప్పటికే అన్ని జోనల్ రైల్వే జనరల్ మేనేజర్లకు ఉత్తర్వులు జారీ చేసినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. రిటైర్డ్ ఉద్యోగులు గత ఐదేళ్ల మెడికల్ ఫిట్‌నెస్‌తో పాటు, పదవీ విరమణకు ముందు ఉద్యోగంలో ఉన్నప్పుడు వారి పనితీరును పరిశీలించి ఈ నియామకాలు చేపట్టనున్నారు. గతంలో విజిలెన్స్, లేదా డిపార్ట్‌మెంట్ చర్యలను ఎదుర్కొన్న వారు దరఖాస్తులకు అనర్హులని తేల్చినట్లు సమాచారం. ఇలా నియమించుకున్న వారికి.. చివరిసారిగా వారు పొందిన నెలవారీ వేతనంలో నుంచి బేసిక్ పింఛనును తొలగించి జీతాలు చెల్లించనున్నారు. అంతేగాక, ట్రావెల్ అలెవెన్స్‌లు, అధికారిక టూర్ల వంటి ప్రయోజనాలు కల్పించనున్నారు. అయితే, ఇంక్రిమెంట్ల వంటి బెనిఫిట్స్ వీరికి ఉండవని సదరు కథనాలు పేర్కొన్నాయి. సిబ్బంది కొరతతో పాటు గత కొంతకాలంగా రైలు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఒక్క వాయవ్య రైల్వే జోన్‌లోనే

## ప్రజా నాడి




## జగిత్యాల పట్టణంలో క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్ ముఠా గుట్టురట్టు

- **పోలీసులు అదుపులో ఐదుగురు ముఠా సభ్యులు**
- **ఆన్లైన్ పెట్టుబడుల పేరుతో మోసపోవద్దు - సిఐ వేణు గోపాల్**



జగిత్యాల అక్టోబర్ 19 (ప్రజా మంటలు) : జగిత్యాల పట్టణంలో క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్ పేరుతో ప్రజలతో పెట్టుబడి పెట్టిస్తూ, మోసాలకు పాల్పడుతున్న ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు. పట్టణ సీఐ వేణుగోపాల్ మాట్లాడుతూ, గుమ్మడాల నర్సయ్య, కోయల్కర్ వేణు, ఆరె రాజేష్, కూరెల బాబు, కొట్టె మారుతిలు ముఠాగా ఏర్పడి అమాయక ప్రజలను ఇప్పుడు ఉన్న టెక్నాలజీతో, ఆశ చూపి, మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు .

కష్టపడకుండా సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో ప్రభుత్వ ఉద్యోగాలు చేసే వారిని, వ్యాపారం చేసే వారిని, మధ్య తరగతి వారికి ఆన్లైన్ కాయిన్ వ్యాపారం గురించి తెలిపి, డబ్బులు కట్టించేవారని తెలుస్తోంది. జగిత్యాల పట్టణంలో మొదలైన ఈ దందా జగిత్యాల పరిసర గ్రామాలు, ఇతర పట్టణాలకు విస్తరింప జేసి, ప్రజలను మోసం చేస్తున్నారని సిఐ వేణు గోపాల్ తెలిపారు. వీరి మోసాలపై నమ్మదగిన సమాచారం మేరకు నిందితులైన ఐదుగురుని, గుమ్మడాల నర్సయ్య, కోయల్కర్ వేణు, ఆరె రాజేష్, కూరెల బాబు, కొట్టె మారుతి లను అదుపులోకి తీసుకొన్నారు. మరికొందరు రిక్సోస్ ట్రేడ్ యాప్ ద్వారా, యూఏస్డిటి బెప్ 20 అనే క్రిప్టో కరెన్సీ అని, దీనిలో పెట్టుబడులు పెడితే యూఏస్ డాలర్ రూపంలో డబ్బులు వస్తాయని, 18 నెలల్లో పెట్టిన పెట్టుబడి కాకుండా 5 నుండి 10 రేట్లు డబ్బులు వస్తాయని, పెట్టిన డబ్బులకు ప్రతి రోజు ఒక్క శాతం కమిషన్ వస్తుందని, ఎంత మంది ఈ యాప్ లో జాయిన్ చేయిస్తే అంతా లాభాలు వస్తాయని, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, మధ్య తరగతి వారితో పెట్టుబడులు పెట్టించి, వారికి నెలకు కొంత సొమ్ము చెల్లిస్తూ వ్యాపారాన్ని విస్తరించారని తెలిపారు. ఈ వ్యాపారం వెబ్ పోర్టల్ పని చేయకపోతే ముందుగా జాయిన్ అయినా వారు లాభపడుతారని, తరువాత పెట్టుబడులు పెట్టిన వారు నష్టపోతారని తెలిపారు.

ఇదే కాకుండా, ఇంకో బిజినెస్ లో కొత్త చేరికలు, గొలుసు కట్టులో, గొలుసు పెరిగే కొద్దీ కమిషన్ కూడ పెరుగుతుందని, పెట్టిన డబ్బుకు 5 నుండి 10 రేట్లు వస్తాయని తప్పుడు వాగ్దానాలు చేసి నిందితులు ప్రజలను మభ్యపెట్టి, ఈ యాప్ లలో జాయిన్ చేసినట్లు విచారణలో వెల్లడైందని,కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ప్రజలు ఎవరు కూడా ఆన్లైన్లో డబ్బులు పెట్టాలని ఎవరైనా సంప్రదిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, క్రిప్టో, బిట్ కాయిన్ వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని సూచించారు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి ఇలాంటి క్రిప్టో, బిట్ కాయిన్లో పెట్టుబడులు పెట్టవద్దని, కుటుంబాలను రోడ్డుపాలు కావద్దని, ఈ తరహా వ్యాపారాలకు సంబంధించి వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆన్లైన్, క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్ వ్యాపారాలకు ఏలాంటి గుర్తింపు లేదని, ప్రజలకు దురాశకు పోయి కష్టపడి సంపాదించిన డబ్బులను వృధా చేసుకోవద్దని సీఐ వేణుగోపాల్ సూచించారు.




పూనుకుంటే ఎన్నో
మేలు చేయు పనులు ,
కనపడవు కారణం
రాల్చవవి కాసులు !

స్కూళ్ళు, కాలేజీలు
ఆసుపత్రుల పని తీర్లు ,
పట్టనోయ్ ప్రభుత్వాలకు
పనికొచ్చే తీర్మానాలు !

- న్యాలకంటి నారాయణ
9346200066

మొదటి పేజీ తరువాయి



## పదేళ్లు పట్టించుకోనివారి ఉచ్చులో పడొద్దు

**అన్నగా చెబుతున్నా.. 'గ్రూప్-1 మెయిన్స్' రాయండి**

**బంగారు అవకాశాన్ని కోల్పోకండి : అభ్యర్థులకు సీఎం విజ్ఞప్తి**

- ఆందోళనలు విరమించాలి
- పోలీసు డ్యూటీ మీట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- నిరుద్యోగులపై లాఠీచార్జీ, కేసులు వద్దని పోలీసులకు సూచన

సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళనపై స్పందించారు. తరచూ పరీక్షల వాయిదాల వల్ల విద్యార్థులు నష్టపోతారు. గతంలో అభ్యర్థులు ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్లు, లైబ్రరీల చుట్టూ తిరిగారు. వాయిదాల వల్ల విద్యార్థులు ఇతర ఉద్యోగాలు చేసుకోలేని పరిస్థితి ఉంటుంది. ఏళ్ల తరబడి పరీక్షలకు సిద్ధమవుతుంటే తల్లిదండ్రులు బాధపడతారు. ఎవరూ బాధపడొద్దనే వేగంగా నియామకాల భర్తీ చేస్తున్నాం. కొందరి మాయమాటలు నమ్మి నిరుద్యోగులు మోసపోవద్దు. నోటిఫికేషన్ ఇచ్చాక నిబంధనలు మారిస్తే కోర్టులు కొట్టివేస్తాయి. జోవో 55 ప్రకారం పోతే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు నష్టం జరిగేది. గ్రూప్-1 మెయిన్స్‌కు 1:50 ఎంపికలో కూడా రిజర్వేషన్లు పాటిస్తున్నాం" అని అన్నారు. ఉద్యోగాల భర్తీపై గత ప్రభుత్వం చిత్తశుద్ధి చూపలేదని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. ఉద్యోగాల భర్తీని గత ప్రభుత్వం పదేళ్లు పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. గత పదేళ్లలో నిరుద్యోగులను వీళ్లు ఎప్పుడైనా కలిశారానని ప్రశ్నించారు. అశోక్‌నగర్‌కు ఎప్పుడైనా వచ్చారా? ప్రగతిభవన్‌కు పిలిపించుకున్నారానని విపక్షాలను అడిగారు. పరీక్షల నిర్వహణ విధానాన్ని న్యాయస్థానాలు కూడా సమర్థించాయని సీఎం రేవంత్? రెడ్డి గుర్తు చేశారు. 2013 నుంచి 2024 వరకు పోలీసు డ్యూటీ మీట్ జరగలేదు. 11 ఏళ్ల పాటు పోలీస్ డ్యూటీ మీట్ జరగకపోవటం విచారకరమన్నారు. పోలీసుల నైపుణ్యాన్ని, పోరాట పటిమను వెలికి తీసే అవకాశం లేకుండా పోయిందని వాపోయరు. పోలీస్ డ్యూటీ మీట్ కార్యక్రమం పోలీసు సిబ్బందిలో ఒక స్ఫూర్తి నింపుతుందని, తెలంగాణ ఉద్యమంలో కానిస్టేబుల్ కిష్టయ్య చేసిన త్యాగం అందరికీ స్ఫూర్తి అని గుర్తు చేసుకున్నారు. పోలీసుశాఖ తనను ఎంతో భావోద్వేగానికి గురి చేస్తుందని, పోలీసుశాఖ పనితీరు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టతో ముడిపడి ఉంటుందన్నారు. పోలీసులు మంచి చేసినా చిన్న పొరపాటు చేసినా అది ప్రభుత్వానికి వర్తిస్తుందని చెప్పారు. శాంతిభద్రతలు బాగుంటేనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని, శాంతిభద్రతలు బాగున్నందునే హైదరాబాద్ పేరు విశ్వవ్యాప్తమైందని సీఎం రేవంత్? వివరించారు.

### ఆదివాసీ హక్కులను హరిస్తున్నారు

వంటిదని రాహుల్ గాంధీ అన్నారు. దాన్ని ప్రధాని మోదీ వ్యతిరేకించారని ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలను భాజపా నియంత్రిస్తోందన్నారు. కాషాయ పార్టీ రాష్ట్రానికి నిధులు, సంస్థలను నియంత్రించగలదేమో కానీ, నిజాయతీ కాదని వ్యాఖ్యానించారు. కాగా.. ఝార్ఖండ్ ఎన్నికల నేపథ్యంలో రాహుల్ పలు హామీలు ఇచ్చారు. తాము అధికారంలోకి వస్తే వస్తే రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తేస్తామన్నారు. ఇప్పటికే అధికార కూటమి పార్టీలైన జేఎంఎం, కాంగ్రెస్ మధ్య పొత్తు కుదిరింది. సీట్ల పంపిణీపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

## విశాఖ శారద పీఠానికి భూ కేటాయింపు రద్దు

**- వైకాపా ప్రభుత్వం ఇచ్చిన స్థలం అనుమతిని నిలిపివేస్తూ ఉత్తర్వులు**

అమరావతి (ప్రజా మంటలు):

వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు అత్యంత సన్నిహితంగా ఉన్న విశాఖపట్నంలోని శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వామి స్వరూపానందేంద్ర సరస్వతికి చంద్రబాబు ప్రభుత్వం ఝలక్ ఇచ్చింది. గత ప్రభుత్వం విశాఖపట్నంలో ఈ పీఠానికి 15 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. అందుకు సంబంధించిన అనుమతులను చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు చంద్రబాబు ప్రభుత్వం శనివారం కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖపట్నంలో శారదా పీఠానికి 15 ఎకరాలను కేటాయిస్తూ గత జగన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ స్థలం విలువ రూ. 220 కోట్ల ఉంటుందని ఆరోపణలు వచ్చాయి. నాటి జగన్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్ర ఆరోపణలు సైతం వ్యక్తమైన్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆంధ్ర ఓటరు కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం కొలువు తీరింది. ఈ నేపథ్యంలో గత జగన్ ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలు, అవినీతి, అక్రమాలపై కూటమి ప్రభుత్వం దర్యాప్తు చేపట్టింది. అందులోభాగంగా గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న పలు కీలక నిర్ణయాలను రద్దు చేసింది. అందులోభాగంగా శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వామి స్వరూపానందేంద్ర సరస్వతికి కేటాయించిన స్థలానికి ఇచ్చిన అనుమతులను రద్దు చేసింది. ఈ అనుమతులకు సంబంధించిన రద్దు ఉత్తర్వులు సోమవారం వెలువడే అవకాశముందని సమాచారం. 2014 ఎన్నికల్లో వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రతిపక్ష నేతగా పరిమితమయ్యారు. ఇక 2019 ఎన్నికల్లో అధికారం పీఠం అందుకునేందుకు ఆయన తీవ్రంగా ప్రయత్నించారు. ఆ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర సైతం చేశారు. అందులోభాగంగా తాను హిందువుననే సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అలా విశాఖలోని శారదాపీఠం శ్రీశ్రీశ్రీ స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి దోస్తి కుదిరింది. ఆయనతో కలిసి తిరుమల శ్రీవారిని సైతం వైఎస్ జగన్ చేసుకున్నారు. ఇక 2019 ఎన్నికల్లో జగన్ పార్టీ 151 స్థానాల్లో విజయం సాధించింది. ఎన్నికల ఫలితాలపై స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి సైతం స్పందించారు. రాష్ట్రానికి వైఎస్ జగన్ అవసరం చాలా ఉందంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు. ఆ తర్వాత.. విశాఖలోని శారదాపీఠానికి నాటి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులే కాదు... ఉన్నతాధికారులు సైతం క్యూ కట్టారు. అయితే గతంలో విశాఖపట్నం నగర శివారులో ఈ శారదా పీఠం ఉండేది. ఇక జగన్ ప్రభుత్వం.. ఈ శారదా పీఠానికి 15 ఎకరాలు కేటయించింది. ఈ కేటాయింపులపై విమర్శలు సైతం వెల్లువెత్తాయి. అలాగే తెలంగాణ సీఎం కేసీఆర్ సైతం హైదరాబాద్ నగర శివారులో విలువైన భూములను శారదా పీఠానికి కేటాయించారు. ఈ వ్యవహారంపై కూడా ఆరోపణలు వచ్చాయి. అంతేకాకుండా ఈ శారదా పీఠాధిపతి ఆధ్వర్యంలో మరోసారి అధికారం కోసం కేసీఆర్ యాగం సైతం నిర్వహించిన సంగతి తెలిసిందే.

## జీవో నం. 29 రద్దుపై విద్యార్థుల ఆందోళన

**- చలో సెక్రేటరియట్‌ను అడ్డుకున్న పోలీసులు**

తెలుగు తల్లి ఫ్లై ఓవర్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. అక్కడి నుంచి బీజేపీ కార్యాలయానికి తరలించారు. ఈ ఘటనపై బండి సంజయ్ మండిపడ్డారు. మరోవైపు ఆందోళన చేస్తున్న గ్రూప్ వన్ అభ్యర్థులను డీజీపీ జితేందర్ హెచ్చరించారు. గ్రూప్ 1 పరీక్షల కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్ల మీదికి వచ్చి సామాన్య ప్రజలను ఇబ్బంది పెడితే ఊరుకోమని స్పష్టం చేశారు. శాంతిభద్రతలను రక్షించాలనే శుక్రవారం ఆందోళనను అరికట్టామని అన్నారు. సమస్య పరిష్కారానికి సుప్రీం కోర్టు కు వెళ్ళాలి కానీ రోడ్ల మీద ఆందోళన చేస్తే ఊరుకోమంటూ డీజీపీ జితేందర్ వార్నింగ్ ఇచ్చారు. కాగా.. గ్రూప్ వన్ మెయిన్స్‌కు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈనెల 21 నుంచి 27 వరకు గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్షలు జరుగనున్నాయి. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పరీక్షలు పకడ్బంధీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. మరోవైపు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష తుది కీలో తప్పులు ఉన్నాయని, అందువల్ల ఆ పరీక్షను రద్దు చేసి మెయిన్స్ పరీక్ష నిర్వహించకుండా అడ్డుకోవాలని కోరుతూ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీలు దాఖలైన విషయం తెలిసిందే. ÷నైల్ కీలో తప్పులు ఉండటంతోపాటు వివిధ కారణాలతో ప్రాథమిక పరీక్షను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సింగిల్ జడ్జి ధర్మాసనం కొట్టేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీల్ పిటిషన్లను హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ సమర్థించింది. చివరి నిమిషంలో పరీక్ష రద్దు సాధ్యం కాదని హైకోర్టు స్పష్టం చేసింది. పరీక్షలు వాయిదా వేయాలని ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. దీంతో గ్రూప్ 1 పరీక్షలకు అడ్డంకులు తొలిపోయిన్లటైంది.

## త్యాగాల చరిత్ర గాంధీ కుటుంబాలది

**దోపిడీ చేసిన చరిత్ర కెసిఆర్ కుటుటంబానిది**

**హైడ్రా ఆక్రమణదారుల్లో అంకుశంలా పనిచేస్తోంది**

**రాజీవ్ సద్భావనా యాత్రలో సిఎం రేవంత్ నిప్పులు**

హైదరాబాద్, (ప్రజా మంటలు):

తెలంగాణను దోపిడీ చేసిన చరిత్రి కేసీఆర్ కుటుంబానిది కాగా, దేశం కోసం తమ ప్రాణాలు సైతం అర్పించిన ఘనత గాంధీ కుటుంబానిదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. దేశం కోసం ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ తమ ప్రాణాలు సైతం అర్పించారని.. అదే విధంగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి పదవిని సైతం త్యాగం చేశారని రేవంత్ పేర్కొన్నారు. చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ సద్భావనా యాత్ర స్మారక దినోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. మాజీ మంత్రి గీతారెడ్డికి రాజీవ్ గాంధీ సద్భావనా అవార్డును సీఎం రేవంత్ రెడ్డి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ సమగ్రత కోసం రాజీవ్ గాంధీ 34 ఏళ్ల క్రితం సద్భావన యాత్ర చేపట్టారు. ప్రతి ఏడాది అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ వస్తున్నాం. సుదీర్ఘ కాలం ప్రజలకు సేవలు అందించిన మాజీ మంత్రి గీతా రెడ్డిని సద్భావన అవార్డుకు ఎంపిక చేసినందుకు సంతోషంగా ఉంది. రాజకీయాల్లో ఉంటే పదవుల కోసం పాకులాడే వారిని చూశా కానీ గత ఎన్నికల్లో ఏమీ ఆశించకపోగా, పోటీ చేయని గొప్ప వ్యక్తి గీతారెడ్డి' అని పేర్కొన్నారు. గాంధీ కుటుంబం తీసుకున్న నిర్ణయాలతోనే దేశంలో పేదలకు మేలు జరిగింది. పేదలకు మేలు జరిగేది గాంధీకుటుంబంతో మాత్రమే. మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారని అందరికీ తెలుసు. సోనియా, రాహుల్ గాంధీ ప్రధాని పదవులను త్యాగం చేశారు. గాంధీ కుటుంబానికి, దోపిడీ చరిత్ర ఉన్న వారికి ఏమైనా పోలిక ఉందా? అని ప్రశ్నించారు. ఆక్రమణలకు పాల్పడ్డ బడా బాబుల పట్ల భూతం హైడ్రా అని రేవంత్ రెడ్డి అన్నారు. నాళాలు, చెరువులను, ప్రభుత్వ భూములను, ఆక్రమించుకుని పెద్ద పెద్ద బిల్డింగులు, ఫాం హౌస్‌లు కట్టిన వారిపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. అక్రమాలకు పాల్పడిన మదపుటేనుగులను అణచడానికి హైడ్రా అంకుశంలా పనిచేస్తుంద న్నారు. అయితే కొందరు ఉద్దేశపూర్వకంగా హైడ్రాను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ బిజినెస్ ను సైతం దెబ్బ తీయాలని కుట్ర జరుగుతోందన్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకుని హైడ్రా వారిపై చర్యలు తీసుకుంటుంటే బిల్లా రంగాలు వచ్చి బుల్డోజర్లకు అడ్డు పడతామంటున్నారు. మూసీ వద్దకు కాదు, జన్వాడ ఫామ్ హౌస్ కు పోదాం. గుల్బాపూర్ నాలాను ఆక్రమించుకుని కేటీఆర్ ఫామ్ హౌస్ కట్టలేదా? అని రేవంత్ ప్రశ్నించారు. ఫామ్ హౌస్ కు బుల్డోజర్ వస్తుందనే బీఆర్ఎస్ నేతలు డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. హరీశ్.. నీలాంటి వాళ్లు కాదు.. ఫామ్ హౌస్ లో పడుకున్న వాళ్లను రమ్మను, నేను కూడా వస్తా.. నీది ఒక స్థాయేనా అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. మూసీ పునరుజ్జీవనం వేరు, హైడ్రా వేరు. మూసీలో ఎలాంటి కూల్చివేతలు చేపట్టలేదు. ట్రాఫిక్ సమస్య, నాళాల పునరుద్ధరణకు అడ్డుకట్ట వేయడానికే హైడ్రా పనిచేస్తోంది. మీరు చెప్పినట్టు అక్కడికి ఇక్కడికి కాదు, ఫామ్ హౌస్ కు రమ్మని సవాల్ చేశారా? అని ప్రశ్నించారు. వాళ్ల ఫామ్ హౌస్ ల వద్దకు ఎప్పుడు రావాలో అది కూడా హరీష్ రావు చెప్పాలన్నారు. హరీశ్ రావు, కేటీఆర్ ఫామ్ హౌస్ లకు సంబంధించి అఖిలపక్షం పిలిచి, నిజ నిర్ధారణ కమిటీతో నిజాలు ఏంటో తేల్చేద్దామని పిలుపునిచ్చారు.

## యూహ్యా సిన్వర్ మరణించినా.. హమాస్ పోరాటం ఆగదు

**- ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ**

టెహ్రాన్((ప్రజా మంటలు):

హమాస్ మిలిటెంట్ సంస్థ అధినేత యాహ్యా సిన్వర్‌ను ఇజ్రాయెల్ దళాలు హతమార్చడంపై ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ స్పందించారు. సిన్వర్ మృతి బాధ కలిగిస్తోంది.. అయినప్పటికీ అతడు అమరుడు కావడంతో అంతా అయిపోయినట్లు కాదని ఆయన వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ దాడిలో అతడు చనిపోయినా హమాస్ ఇంకా ఉనికిలోనే ఉందని.. ఎప్పటికీ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. 'శత్రువులు తమపై విపరీత దాడులకు పాల్పడుతున్నా సిన్వర్ దృఢ సంకల్పంతో వారికి ఎదురు నిలిచారు. వారి వ్యూహాలకు దీటుగా బదులిచ్చారు. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై జరిపిన దాడులకు సూత్రధారిగా వ్యవహరించి ఇజ్రాయెల్‌ను ఆయన దెబ్బ కొట్టిన తీరును ప్రపంచం ఎప్పటికీ మరిచిపోదు' అని ఖమేనీ అన్నారు. ఇజ్రాయెల్-హెజ్‌బొల్లాల మధ్య జరుగుతున్న పోరులో హమాస్ చీఫ్ నస్రల్లా మరణం తర్వాత లెబనాన్‌లోకి తన బలగాలను పంపేందుకు ఇరాన్ సిద్ధంగా ఉందని ఆ దేశ ఉన్నతస్థాయి అధికారిని ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. ఇటీవల ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రత్యక్ష దాడికి దిగిన సంగతి తెలిసిందే. దాదాపు 200 బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించింది. అనంతరం దీనిపై ఖమేనీ స్పందిస్తూ హమాస్ అప్పటి అధినేత ఇస్మాయెల్ హనియా, హెజ్‌బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా, నిల్ఫోరూషన్ మరణానికి ప్రతీకారంగా ఈ దాడులు చేపట్టినట్లు ప్రకటించారు. అయితే ఇరాన్ తమపై చేసిన క్షిపణుల దాడికి ప్రతీకారం తీర్చుకోవడానికి సిద్ధమవు తున్నట్లుగా ఇజ్రాయెల్ పేర్కొంది. అదే జరిగితే తమ స్పందన మరింత తీవ్రంగా ఉంటుందని టెహ్రాన్ ఇప్పటికే హెచ్చరించింది. ఈ పరిణామాల వేళ ఖమేనీని సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు వార్తలు వచ్చాయి.

## గాజా గజ గజ

**- తాజా ఇజ్రాయెల్ దాడుల్లో 33 మంది మృతి**

గాజాస్ట్రిప్ (ప్రజా మంటలు):

గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఉత్తర గాజాలో జరిపిన వైమానిక దాడుల్లో 33 మంది పాలస్తీనా వాసులు మృతి చెందారు. ఈ మేరకు అక్కడి అధికారిక వార్తా సంస్థ వెల్లడించింది. ఉత్తర గాజాలోని జబాలియా శిబిరంపై శుక్రవారం రాత్రి ఇజ్రాయెల్ వైమానిక దాడులతో విరుచుకుపడింది. మృతుల్లో 21 మంది మహిళలే కావడం గమనార్హం. ఈ దాడుల్లో కనీసం 85 మందికి తీవ్ర గాయాలయ్యాయి. అనేక మంది శిథిలాల కింద చిక్కుకుని పోయారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా.. ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఇప్పటివరకు 42,500 మందికి పైగా మృతి చెందినట్లు గాజా ఆరోగ్య శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. మరోవైపు, ఇజ్రాయెల్‌పై సిరియా వైమానిక దాడులకు యత్నించింది. తమ భూభాగాన్ని లక్ష్యంగా చేసుకుని జరిపిన వైమానిక దాడులను సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. అది తమ భూభాగంలోకి ప్రవేశించకముందే దాన్ని కూల్చివేసినట్లు పేర్కొంది. ఇరాన్ మద్దతుతోనే సిరియా ఈ డ్రోన్లను ప్రయోగించిందని తెలిపింది.

## జాతీయ మహిళా కమిషన్ నూతన చైర్‌పర్సన్‌గా విజయ కిషోర్ రహాట్కార్

**- ఎన్‌సీడబ్ల్యూ సభ్యురాలిగా డాక్టర్ అర్చన మజుందార్ - మూడేళ్లపాటు పదవిలో కొనసాగేలా ఉత్తర్వులు**

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):

జాతీయ మహిళా కమిషన్ కొత్త చైర్‌పర్సన్‌గా విజయ కిషోర్ రహాట్కార్ ను కేంద్ర ప్రభుత్వం శనివారంనాడు నియమించింది. నేషనల్ కమిషన్ ఫర్ ఉమన్ యాక్ట్-1990లోని సెక్షన్ 3 కింద ఈ నియామకం జరిపినట్టు ఒక నోటిఫికేషన్‌లో కేంద్రం తెలిపింది. ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్‌గా మూడేళ్లు పాటు ఆమె ఈ పదవిలో ఉంటారు. రహాట్కర్‌తో పాటు ఎన్‌సీడబ్ల్యూ సభ్యురాలిగా డాక్టర్ అర్చన మజుందార్‌ను కూడా కేంద్రం నియమించింది. మజుందార్ నియామకం కూడా మూడేళ్ల పాటు కొనసాగుతుంది. ఎన్‌సీడబ్ల్యూ 9వ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తు?న్న విజయా రహాట్కర్ దీనికి ముందు మహారాష్ట్ర స్టేట్ కమిషన్ ఫర్ ఉమన్ చైర్‌పర్సన్‌గా 2016-2021 వరకూ సేవలందించారు. పోక్సో, యాంటీ ట్రిపుల్ తలాక్ చర్యలు, యాంటీ ఉమన్ ట్రాఫికింగ్ యూనిట్ల వంటి అంశాలపై చట్టపరమైన సంస్కరణలపై కీలకంగా దృష్టి సారించారు. డిజిటల్ లిటరసీ కార్యక్రమాలను ప్రమోట్ చేశారు. వీటికి తోడు నాయకత్వ ప్రతిభను కూడా ఆయన చాటుకున్నారు. నేషనల్ యూత్ ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షురాలిగా, మహిళ విభాగం అధ్యక్షురాలిగా ఏడళ్లు పనిచేశారు. ప్రస్తుతం నేషనల్ సెక్రటరీగా ఉన్నారు. 2007 నుంచి 2010 వరకూ ఛత్రపతి సంభాజీనగర్ మేయర్‌గా సేవలందించారు. హెల్త్‌కేర్, మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన ప్రాజెక్టు విషయంలో కీలకంగా వ్యవహరించారు. ఇంటర్నేషనల్ కల్చరల్ సెంటర్‌గా సిటీని అభివృద్ధి చేసేందుకు, టూరిజం పోత్సాహానికి కృషి చేశారు. ప్రస్తుతం ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్-గవర్నమెంట్ అడ్వయిజరీ డైరెక్టర్‌గా కూడా ఉన్నారు. మహిళా సాధికారతకు చేసిన కృషికి పలు అవార్డులు అందుకున్నారు. నేషనల్ లా అవార్డు, సావిత్రభాయి పులే అవార్డులు ఆమెను వరించాయి. మహిళా లీగల్ అంశాలపై 'విధిలిఖిత్' అనే పుస్తకంతో సహా పలు పలు పుస్తకాలను రచించారు. పుణె యూనివర్శిటీలో ఫిజిక్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ, హిస్టరీలో మాస్టర్ డిగ్రీ పొందారు.

## బీఆర్ఎస్ దారిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం

**- జీవో 29 వెనక రిజర్వేషన్ల రద్దు కుట్ర**

**- కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శలు**

హైదరాబాద్, (ప్రజా మంటలు):

జీవో 29 వెనుక రిజర్వేషన్లు రద్దు చేసే కుట్ర దాగి ఉందని అభ్యర్థులు అభిప్రాయపడుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళన నేపథ్యంలో శనివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'అన్ని వర్గాలకు న్యాయం చేసేందుకే మోదీ ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తెచ్చింది. జీవో 29 వల్ల అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందనేది వాస్తవం. గ్రూప్-1 రద్దు చేయాలని ఎవరూ అడగట్లేదు, వాయిదా వేయాలని మాత్రమే కోరుతున్నారు. భారాస ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోంది. పరీక్ష పూర్తయిన తర్వాత కోర్టు రద్దు చేస్తుందనే భయం అభ్యర్థుల్లో ఉంది. సోనియాగాంధీ జన్మదినం రోజున ఇంకా ఎంతమందిని బలి తీసుకుంటారో తెలియదు. గ్రూప్-1 అభ్యర్థులపై రోజూ లాఠీఛార్జి జరుగుతోంది. వారిది న్యాయమైన డిమాండ్. రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే స్పందించాలి. సమస్యను పరిష్కరించేందుకు ఆలోచించాలి కానీ, ప్రభుత్వం మొండిపట్టుతో వ్యవహరించడం మంచికాదు. నిరుద్యోగుల ఆందోళనపై భారాస పెద్ద కుట్ర చేసింది. మా ర్యాలీలో చొరబడి విధ్వంసాలకు పాల్పడాలని చూస్తే నిరుద్యోగ యువత అడ్డుకున్నారు. మా పార్టీ కార్యకర్తలతో గొడవకు దిగారు' అని బండి సంజయ్ వివరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రి పదవి, సీఎం రేవంత్ రెడ్డిపై తాను చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ ట్వీట్ చేయడంపై బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కుర్చీని కాపాడేందుకు బండి సంజయ్ తాపత్రయ పడుతున్నారని, రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమా? లేక బీజేపీ అనుబంధ ప్రభుత్వమా? అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. దీనికి కౌంటర్‌గా గత బీఆర్ఎస్ ప్రభుత్వం, కేటీఆర్‌పై కేంద్ర మంత్రి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. ' కేటీఆర్ అరవకు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నువ్వు, మీ నాన్న కేసీఆర్ దోషులు. ఎందుకు మిమల్ని సీఎం రేవంత్ రెడ్డి అరెస్టు చేయడం లేదు. తండ్రికొడుకులు ఇద్దరూ ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ పెద్దల కాళ్లు పట్టుకుంది నిజం కాదా?. రేవంత్ రెడ్డి.. నీకు దమ్ముంటే ఫోన్ ట్యాపింగ్ కేసు సీబీఐకి అప్పగించాలి. మేము కూడా కేంద్రం తరుపున సీబీఐని రిక్వెస్ట్ చేస్తాం. అప్పుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని బయటపడుతుంది. హర్యానా, జమ్మూకశ్మీర్ ఎన్నికలకు కాంగ్రెస్ ఖర్చు చేసిన డబ్బు బీఆర్ఎస్ పార్టీ ఇచ్చినదే. కేటీఆర్ అహంకారమే ఆ పార్టీని ఈ దుస్థితికి తెచ్చింది. నీ అహంకారపూరిత మాటల వల్లే మీ పార్టీ గత ఎన్నికల్లో ఓడిపోయింది. ఇప్పుడు మళ్లీ అదే రకంగా మాట్లాడుతున్నావు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటి కానే కాదు. దోస్తులమైతే



ఫోన్లలో మాట్లాడుకుంటాం. మీడియాకు స్టేట్మెంట్లు ఇవ్వం. అసలు దోస్తానా కేసీఆర్, కాంగ్రెస్ కే ఉంది అంటూ వ్యాఖ్యానించారు. హర్యానా, జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డబ్బు సహాయం చేసింది కేసీఆరే. డబ్బు సంచులతో ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ పెద్దలకు ఇచ్చింది వాస్తవం కాదా?. మీ రెండు పార్టీల మధ్య స్నేహ సంబంధాలు లేకపోతే ఫోన్ ట్యాపింగ్ కేసు ఎందుకు ముందుకు సాగడం లేదు. ఈ కేసులో కేసీఆర్ ఆదేశాల మేరకే అధికారులు ట్యాపింగ్ చేసినట్లు క్లియర్‌గా రిపోర్టు ఉంది. ఈ రిపోర్టు ప్రకారం కనీసం ఆయనకు 41సీఆర్పీసీ నోటీసూ ఎందుకు ఇవ్వడం లేదు. దీన్ని బట్టి అర్థమవుతుంది బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని. మీ మధ్యలో స్నేహం లేకపోతే కేసును సీబీఐకి అప్పగించండి. సీబీఐ ద్వారా విచారణ జరిపితే అన్ని విషయాలు బయటకు వస్తాయి' అన్నారు.

## ఇజ్రాయెల్ ప్రధాని నివాసం లక్ష్యంగా డ్రోన్ దాడి

టెల్‌అవీవ్(ప్రజా మంటలు):
పశ్చిమాసియాలో తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఆందోళనకర ఘటన చోటు చేసుకుంది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇంటివైపు డ్రోన్ దూసుకొచ్చింది.సిజేరియాలోని ఆయన నివాసం లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో ఎవరూ గాయపడలేదని ఇజ్రాయెల్ ప్రభుత్వం వెల్లడించింది. ఆ సమయంలో ప్రధాని, ఆయన సతీమణి నివాసంలో లేరని పేర్కొంది. ఇక ఈ ఉదయం లెబనాన్‌వైపు నుంచి డ్రోన్లు దూసుకొస్తున్న తరుణంలో ఇజ్రాయెల్‌లో సైరన్లు మోగాయి. ప్రస్తుతం ఇజ్రాయెల్.. హమాస్, హెజ్‌బొల్లా గ్రూప్‌లు అంతమే లక్ష్యంగా దాడులు చేస్తోంది. హమాస్ అధినేత యాహ్యా సిన్వర్‌తో సహా నాయకత్వ హోదాలో ఉన్న పలువురిని నెతన్యాహు సేనలుహతమార్చాయి. అలాగే లెబనాన్‌లోని హెజ్‌బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా సహా పలువురు కీలక కమాండర్లను మట్టుపెట్టింది. సిన్వర్ మృతి తర్వాత స్పందించిన హెజ్‌బొల్లా.. తమ పోరాట దశను మార్చేలా ప్రణాళికలు వేసుకున్నామని తెలిపింది. క్షిపణులు, డ్రోన్లతో దాడులు తీవ్రం చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో హెజ్‌బొల్లా కేంద్రమైన లెబనాన్ వైపు నుంచి మూడు డ్రోన్లు దూసుకొచ్చినట్లు ఇజ్రాయెల్ దళాలు వెల్లడించాయి. సిజేరియాలోకి ఒక భవనాన్ని డ్రోన్ ఢీకొట్టినట్లు తెలిపాయి. మరో రెండింటిని అడ్డుకున్నామని పేర్కొన్నాయి.ఇదిలా ఉంటే.. సిన్వర్ మృతితో యుద్ధం కీలకమలుపు తిరిగే అవకాశం ఉందని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఇజ్రాయెల్ మాత్రం తమ బందీలు విడుదలయ్యేవరకు పోరాటం ఆగదని స్పష్టం చేసింది. హమాస్ మిలిటెంట్లు ఆయుధాలను వదిలి.. బందీలను విడుదల చేస్తే వెంటనే యుద్ధం ముగిస్తామని నెతన్యాహు ప్రకటించారు. ఆపై హమాస్ తీవ్రవాదులు జనజీవన స్రవంతిలో కలిసి సాధారణ జీవితం గడిపే అవకాశం కల్పిస్తామన్నారు. లేదంటే వెంటాడి మరీ వారిని హతమరుస్తామని హెచ్చరించారు.దానికి తగ్గట్టే ఉత్తర గాజాలోని జబాలియా శిబిరంపై శుక్రవారం రాత్రి ఇజ్రాయెల్ వైమానిక దాడులతో విరుచుకుపడింది. 33 మంది పాలస్తీనా వాసులు మృతి చెందగా.. అందులో 21 మంది మహిళలే ఉన్నారు. ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఇప్పటివరకు 42,500 మందికి పైగా మృతి చెందినట్లు గాజా ఆరోగ్య శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది.

## హమాస్ కంటే.. హెజ్‌బొల్లాతో కాల్పుల విరమణ ఒప్పందమే సులభం- బైడెన్

న్యూయార్క్(ప్రజా మంటలు): మధ్య ప్రాచ్యంలో సంఘర్షణను తగ్గించడానికి చర్చలు జరిపిన అనంతరం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ – హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదర్చడం కంటే..ఇజ్రాయెల్–హెజ్‌బొల్లా మధ్య డీల్ తీసుకురావడమే సులభమని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం బెర్లిన్‌లో జరిగిన సమావేశంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మెక్రాన్, జర్మన్ ఛాన్సలర్ ఒలాఫ్ షోల్జ్ పాల్గొన్నారు. అనంతరం బైడెన్ మాట్లాడుతూ పైవిధంగా మాట్లాడారు.”మధ్యప్రాచ్య దేశాలలో సంఘర్షణను ముగించే మార్గం గురించి మేము చర్చించాం. ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలకు కొంతకాలం పాటు నిలిపివేయడానికి మా వద్ద ఓ ప్రణాళిక ఉంది. దాన్ని మా మిత్ర దేశాలు కూడా అంగీకరించాయి. ఇక, ప్రస్తుతం జరుగుతున్న చర్చల నేపథ్యంలో లెబనాన్‌తో ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం త్వరలోనే సాధ్యమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. కానీ, గాజాపై మాత్రం డీల్ కుదరడం కష్టంగా కన్పిస్తోంది. అయినా కూడా ఈ చర్చలతో తప్పకుండా ఫలితం ఉంటుందని భావిస్తున్నాం” అని బైడెన్ పేర్కొన్నారు.అయితే హమాస్ అధినేత సిన్వర్ మరణం తర్వాత ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు బైడెన్‌కు ఫోన్ చేసి.. బందీల విడుదల, కాల్పుల విరమణ ఒప్పందాలపై చర్చల గురించి మాట్లాడినట్లు వార్తలు వచ్చాయి. వీటిపై అమెరికా అధ్యక్షుడిని ప్రశ్నించగా.. స్పందించడానికి ఆయన నిరాకరించారు.మరోవైపు, బ్రిటన్ ప్రధాని స్టార్మర్ మాట్లాడుతూ.. మధ్యప్రాచ్య దేశాలలో ఉద్రిక్తతలను నివారించడానికి తాము కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ ఘర్షణకు సైనిక చర్యలే పరిష్కారం కాదని.. దౌత్య చర్చలతోనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. ప్రస్తుతం గాజాలో కాల్పుల విరమణ, బందీలను తక్షణమే విడుదల చేయడం, తక్షణ మానవతా సాయం అందించడం అవసరమని.. ఇరుదేశాల మధ్య దీర్ఘకాల శాంతి, భద్రతల స్థాపనకు ఇదే ఏకైక మార్గమని పేర్కొన్నారు.ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా మధ్య భీకర దాడులు కొనసాగుతున్నాయి. కాగా హమాస్ మిలిటెంట్ సంస్థ అధినేత యాహ్యా సిన్వర్‌ను ఇజ్రాయెల్ దళాలు మట్టుపెట్టడంతో హమాస్‌కు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఇకపై హమాస్ యుద్ధాన్ని మరింత తీవ్రం చేస్తుందా? లేదంటే కాల్పుల విరమణ ఒప్పందానికి మొగ్గు చూపుతుందా? అని ప్రపంచదేశాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి.

## మంత్రివర్గ ఉపసంఘం నివేదిక ఆధారంగా రైతుభరోసా

**- వచ్చే సీజన్ నుంచి పంటబీమా పథకాల అమలు - మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**

హైదరాబాద్ (ప్రజా మంటలు):
తెలంగాణ మంత్రివర్గ ఉపసంఘం నివేదిక వచ్చిన తర్వాత రాబోయే సీజన్ నుంచి రైతుభరోసా పథకం అమలు చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పంట బీమా పథకం వచ్చే సీజన్ నుంచి అమలు చేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో రైతు బీమా, రుణ మాఫీ, రైతు భరోసా, ధాన్యం, పత్తి, ఇతర పంటల కొనుగోళ్లు కనీస మద్దతు ధర, ఇతర వ్యవసాయ అంశాల గురించి మంత్రి మాట్లాడారు. మంత్రివర్గ ఉపసంఘం నివేదిక రాగానే రాబోయే పంట కాలం నుంచి రైతులకు ఎకరాకు రూ.7500 సాయం అందిస్తామని తెలిపారు. హైదరాబాద్ బీఆర్కేఆర్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణాలు ఉన్న రైతు కుటుంబాలను గుర్తించి డిసెంబరులోగా వారి బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తామన్నారు. అదేవిధంగా రూ.2 లక్షలకు పైగా రుణాలు ఉన్న, నిర్ధరణ కాని రైతు కుటుంబాల కోసం త్వరలో షెడ్యూల్ ప్రకటించి అర్హులైన వారికి న్యాయం చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో ప్రకృతి విపత్తుల కారణంగా దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10 వేలు పరిహారం ఇస్తున్నామన్నారు. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)కే అన్ని పంటలను కొనుగోలు చేస్తున్నప్పటికీ... ప్రస్తుతం 25 శాతం మాత్రమే తీసుకుంటుందని కేంద్రం చెప్పారు. పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని కేంద్రానికి లేఖ రాశామని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, టీజీ సీడ్స్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, రైతు సంఘాల నేతలు సారంపల్లి మల్లారెడ్డి, పశ్య పద్మ, నల్లమల వెంకటేశ్వరరావు, లోకసాని పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జార్ఖండ్‌లో పొత్తుపొడుపులు

**- జట్టుకట్టిన కాంగ్రెస్, జెఎంఎం**

**- 70 సీట్లలో కలిసి పోటీచేయాలని నిర్ణయం**

**- డిజిపి అనురాగ్ గుప్తాపై ఈసీ వేటు**

రాంచీ (ప్రజా మంటలు):
ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల వేళ.. అధికార కూటమి పార్టీలైన జేఎంఎం, కాంగ్రెస్ మధ్య పొత్తు కుదిరింది. 81 అసెంబ్లీ స్థానాలకుగానూ 70చోట్ల ఈ రెండు పార్టీలు అభ్యర్థులను నిలబెడతాయని ఝార్ఖండ్ ముఖ్యమంత్రి, జేఎంఎం నేత హేమంత్ సోరెన్ వెల్లడించారు. ‘సీట్ల పంపకాలపై ప్రస్తుతం మరిన్ని వివరాల్లోకి వెళ్లదల్చుకోలేదు. మా మిత్రపక్షాల నేతల సమక్షంలో సీట్ల సంఖ్యను ఫైనల్ చేసుకుంటామని మీడియాకు వెల్లడించారు. మిగతా 11 స్థానాల్లో ఆర్జేడీ, వామపక్ష పార్టీలతో చర్చలు జరుగుతున్నట్లు తెలిపారు. అయితే సోరెన్ ప్రకటనపై ఆర్జేడీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. జేఎంఎం, కాంగ్రెస్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నాయంటూ స్పందించింది. ఎన్నికల్లో పోటీ విషయంలో తమ ముందు అన్ని అవకాశాలు ఉన్నట్లు పేర్కొంది. 15- 18 స్థానాల్లో ఒంటరిగానే భాజపాను ఓడించే సత్తా ఆర్జేడీకి ఉందని వ్యాఖ్యానించింది. ఝార్ఖండ్ ఎన్నికలకు ఇటీవలే నోటిఫికేషన్ వచ్చిన సంగతి తెలిసిందే. ఈ రాష్ట్రంలో రెండు దశల్లో పోలింగ్ జరగనుంది. నవంబర్ 13, 20 తేదీల్లో ఓటింగ్ జరగనుండగా.. అదే నెల 23వ తేదీన ఫలితాలు వెల్లడికానున్నాయి. ఇదిలావుంటే ఎన్నికల వేళ ఝార్ఖండ్ తాత్కాలిక డీజీపీ అనురాగ్ గుప్తాపై ఎన్నికల సంఘం వేటువేసింది. తక్షణమే ఆయన్ను విధుల తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎన్నికల నిర్వహణ విషయంలో గతంలో ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఆయన్ను పక్కన పెట్టాలని తన ఆదేశాల్లో పేర్కొంది. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

## దేశరాజకీయాలను మార్చే ‘మహా’ ఎన్నికలు

- సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్
- మహా వికాస్ అఘాడీ పొత్తులో ఎస్పీకి 12 సీట్లు

ముంబయి (ప్రజా మంటలు): మహారాష్ట్రలో నవంబర్ 20న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ప్రతిపక్ష 'మహా వికాస్ అఘాడీ' సీట్ల పంపకంలో భాగంగా సమాజ్‌వాదీ పార్టీకి 12 స్థానాలు ఇవ్వాలని కోరినట్లుగా సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ పేర్కొన్నారు. తమ పార్టీకి బలమున్న కొన్ని స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించామని తెలిపారు. మహారాష్ట్రలోని ధూలే నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా ఇర్షాద్ జహాగీర్దార్‌ను ప్రకటిస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర భవిష్యత్తును మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తును కూడా నిర్ణయిస్తాయని ఆయన అన్నారు. ధూలే నగరంలో ఏర్పాటు చేసిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ భాజపాపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో పార్టీలను విభజించి.. అధికారాన్ని దొంగిలించిందని అఖిలేష్ దుయ్యబట్టారు. అసెంబ్లీకి విద్యావంతులైన ఎమ్మెల్యేలను పంపడం ప్రజల బాధ్యత అని పేర్కొన్నారు. ‘మహారాష్ట్ర ఎన్నికలు దేశ రాజకీయాలను మార్చగలవు. ఇవి చారిత్రకమైనవి. ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో భాజపా ప్రభుత్వం ఉండదు. దీంతో దిల్లీలోని కేంద్ర ప్రభుత్వం కూడా కూలిపోతుంది. అన్ని విషయాలకు బుల్డోజర్‌లను పంపే ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదు‘ అని అఖిలేష్ జోస్యం చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాను, దాని మిత్రపక్షాలను ఓడించి.. తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలోని మహాయుతి ప్రభుత్వం ఇక్కడి పరిశ్రమలను గుజరాత్‌కు తరలిస్తోందని ఆయన ఆరోపించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల ప్రకటించింది. రాష్ట్రంలో ఒకే దశలో నవంబర్ 20న పోలింగ్ జరగనుండగా నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది. అయితే శివసేన, ఎన్సీపీ చీలిక తర్వాత జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు కావడంతో దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. అసలైన శివసేన, ఎన్సీపీ ఏవో ప్రజలు తేల్చనున్నారు.

## కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ

**- ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మంత్రివర్గం తీర్మానం**

**- ఆమోదించిన లెఫ్టినెంట్ గవర్నర్**

శ్రీనగర్ (ప్రజా మంటలు):
జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కేంద్రాన్ని కోరుతూ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మంత్రివర్గం చేసిన తీర్మానాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆమోదించారు. ఈ అంశాన్ని ప్రధానితో పాటు కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు క్యాబినెట్ సమావేశంలో ఓ అంగీకారానికి వచ్చారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణకు సంబంధించిన విషయాలపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులతో సమావేశమయ్యేందుకు ముఖ్యమంత్రి త్వరలో దిల్లీ వెళ్లనున్నట్లుగా అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా..మొదటి శాసనసభా సమావేశం నవంబర్ 4న జరగనున్నట్లుగా క్యాబినెట్ పేర్కొంది. కొత్తగా ఎన్నికైన అసెంబ్లీ సభ్యులతో ప్రమాణం చేయించేందుకు ముబారిక్ గుల్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించాలని సిఫార్సు చేసింది. శాశ్వత స్పీకర్ ఎన్నికయ్యే వరకూ గుల్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్రపాలిత ప్రాంతంగా మారిన జమ్మూకశ్మీర్ తొలి ముఖ్యమంత్రిగా నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) నాయకుడు ఒమర్ అబ్దుల్లా(54) ప్రమాణం చేశారు. అయితే జమ్మూకశ్మీర్ పూర్తిస్థాయి రాష్ట్రంగా ఉన్నప్పుడు 2009 నుంచి 2014 వరకు ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2019లో అధికరణం 370తో పాటు.. జమ్మూకశ్మీర్ రాష్ట్రహోదాను కేంద్రం రద్దు చేసిన సంగతి తెలిసిందే. జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంగా మారిన తర్వాత తొలిసారి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్‌సీ–కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. 90 స్థానాల శాసనసభలో ఎన్‌సీ 42 సీట్లలో, కాంగ్రెస్ 6 స్థానాల్లో నెగ్గింది. అబ్దుల్లా కుటుంబం నుంచి సీఎంగా పగ్గాలు చేపట్టిన మూడో వ్యక్తి ఒమర్ అబ్దుల్లా. తాత షేక్ అబ్దుల్లా, తండ్రి ఫరూక్ అబ్దుల్లా కూడా గతంలో సీఎంగా విధులు నిర్వహించారు. ఇటీవల జమ్మూ కశ్మీర్‌లో జరిగిన ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) విజయం సాధించిన అనంతరం ఒమర్ అమర్ అబ్దుల్లా మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలనే డిమాండే తొలి క్యాబినెట్ తీర్మానమని పేర్కొన్నారు.

# కెనడాది అదే పంథా..

**- భారత దౌత్యవేత్తలపై నిఘా ఉంచాం**

**- విదేశాంగమంత్రి మెలానీ జోలీ ప్రకటన**

న్యూఢిల్లీ (ప్రజా మంటలు): భారత్‌తో దౌత్యసంబంధాలు తీవ్రస్థాయిలో దెబ్బతింటున్నా కెనడా వైఖరిలో మాత్రం ఎలాంటి మార్పులేదు. ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో మాటల్నే విదేశాంగమంత్రి మెలానీ జోలీ వల్లెవేశారు. అక్కడున్న మిగిలిన దౌత్యవేత్తలపై నిఘా ఉంచామంటూ భారత్‌పై బురదజల్లే ప్రక్రియను కొనసాగించారు. అంతటితో ఆగకుండా భారత్‌ను రష్యాతో పోలుస్తూ అక్కసు వెళ్లగక్కారు. వియన్నా కన్వెన్షన్ ఒప్పంద ఉల్లంఘనకు పాల్పడితే సహించేది లేదని మెలానీ వ్యాఖ్యలు చేశారు. సిక్కుల అతివాద నేత హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకేసు అనుమానితుల జాబితాలో ఏకంగా భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మను చేర్చింది. ఈ పరిణామం రెండు దేశాల మధ్య అగ్గిరాజేసింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన్ని, మరికొందరు అధికారుల్ని అక్కడి నుంచి వెనక్కి తెచ్చేయాలని కేంద్రం నిర్ణయించింది. దిల్లీలోని కెనడా తాత్కాలిక హైకమిషనర్ సహా ఆరుగురు దౌత్యవేత్తల్ని బహిష్కరించింది. ప్రతిగా కెనడా సైతం అదే తరహా నిర్ణయం తీసుకుంది. ఇలా ఉద్రిక్తతలు కొనసాగుతోన్న తరుణంలో మెలానీ మాట్లాడుతూ రష్యా, భారత్ మధ్య పోలిక తెచ్చారు. ‘మా దేశ చరిత్రలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. అంతర్జాతీయ శక్తులు కెనడా గడ్డపై ఇలాంటి అణచివేతకు పాల్పడటాన్ని మేం జరగనివ్వబోం. ఐరోపాలో ఇలాంటివి మేం చూశాం. జర్మనీ, యూకేలో రష్యా ఆ పనిచేసింది. ఇలాంటివాటికి వ్యతిరేకంగా దృఢంగా నిలబడాల్సి ఉంది‘ అని జోలీ వెల్లడించారు. కెనడాలో మిగిలిన భారత దౌత్యవేత్తలను కూడా బహిష్కరిస్తారా ? అని అడగ్గా.. ‘వారిపై నిఘా ఉంచాం. ఒట్టవా హైకమిషనర్ సహా ఆరుగురు దౌత్యవేత్తలను బహిష్కరించాం. మిగిలినవారు వాంకోవర్, టొరంటోలో ఉన్నారు. వియన్నా కన్వెన్షన్‌కు విరుద్ధంగా వ్యవహరించే దౌత్యవేత్తలను మేం సహించబోం‘ అంటూ వ్యాఖ్యలు చేశారు. నిజ్జర్ హత్యకేసులో భారత్ ఏజెంట్ల ప్రమేయం ఉందంటూ గతేడాది ట్రూడో చేసినప్పటినుంచి రెండు దేశాల సంబంధాలు దెబ్బతిన్నాయి. అయితే కేవలం నిఘా సమాచారం ఆధారంగా అప్పుడు భారత్‌పై ఆరోపణలు చేశానని, ఆ సమయంలో ఎటువంటి ఆధారాలు లేవని ట్రూడో ఇటీవల అంగీకరించిన సంగతి తెలిసిందే. దీనిపై భారత్ తీవ్రంగా స్పందించింది. భారత్‌పై నిందలు వేస్తున్న విషయం ఆయన మాటల్లోనే తేటతెల్లమైందని మండిపడింది. అయినా కూడా ట్రూడో తన వ్యాఖ్యలను కొనసాగించారు. కెనడియన్లకు సంబంధించిన సమాచారాన్ని భారత దౌత్యవేత్తలు సేకరించారని, వాటిని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు అందజేశారని మరోసారి ఆరోపించారు.

# దీక్ష విరమించండి.. కాస్త సమయం ఇవ్వండి

**- జూడాకు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విజ్ఞప్తి**



కోల్‌కతా(ప్రజా మంటలు):
పశ్చిమ బెంగాల్‌లోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ ఆసుపత్రి ఘటనలో న్యాయం చేకూర్చాలని, తమ డిమాండ్లు నెరవేర్చాలని జూనియర్ వైద్యులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష కొనసాగుతోంది.కాగా ఈ విషయంపై బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందిస్తూ జూనియర్ వైద్యులు దీక్షను వీడాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరికీ నిరసన తెలిపే హక్కు ఉందని, అయితే.. వైద్యారోగ్య సేవలపై దాని ప్రభావం పడకూడదని ఆమె వ్యాఖ్యానించారు. వైద్యులు తమ ముందుకు తెచ్చిన డిమాండ్లను ఇప్పటికే నెరవేర్చామని, మిగతా వాటి కోసం 3–4 నెలల సమయం ఇవ్వాలని మమత వైద్యులను కోరారు. ఈ విషయంపై చర్చలకు రావాలని మరోసారి జూనియర్ వైద్యులకు పిలుపునిచ్చారు.జూనియర్ డాక్టర్లు సోమవారం ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు రావాలని మమత మరోసారి ఆహ్వానించారు. ఆర్జీకర్ ఆసుపత్రి వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ వైద్యుల వేదిక వద్దకు శనివారం చీఫ్ సెక్రటరీ మనోజ్ పంత్ వెళ్లారు. ఈ సమయంలో సీఎం వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. వైద్యులు చేసిన పలు డిమాండ్లను నెరవేర్చడానికి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఏం చేయాలి? ఏం చేయకూడదు? అనే విషయాలను ప్రభుత్వానికి వైద్యులు నిర్దేశించడం సరికాదని వ్యాఖ్యానించారు. వైద్యుల డిమాండ్లపై చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.కోల్‌కతాలోని ఆర్జీకర్ ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో ఆగస్టు 9న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని వైద్య విద్యార్థులు పెద్దఎత్తున నిరసనలు కొనసాగించారు. సీఎం మమతా బెనర్జీ తమ డిమాండ్లను నెరవేర్చేందుకు హామీ ఇవ్వడంతో.. 42 రోజుల పాటు కొనసాగిన నిరసనలు విరమించి గత నెల 21న పాక్షికంగా విధుల్లో చేరారు. అయితే ప్రభుత్వం నుంచి సానుకూల చర్యలు లేకపోవడంతో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు. దీక్షలో పాల్గొన్న పలువురు అనారోగ్యానికి గురవుతుండటంతో సీనియర్ వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం త్వరగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# కెటిఆర్, హరీష్‌లు బుద్ది వుంటే మాట్లాడుతున్నారా?

**లక్షల కోట్లు దోపిడీ చేసి రోడ్ల మీద పడుతారా**

**అనేక పథకాల పేరుతో దోచుకుని నీతులు చెబుతారా**

**మండిపడ్డ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

హైదరాబాద్ (ప్రజా మంటలు):
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... కాళేశ్వరం, మిషన్ కాకతీయ, భగీరథ ఇంకా ఏవో పేర్లు చెప్పి 7 లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ‘మాకు పదేళ్ల కింద 25 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే సమస్య పరిష్కారం అయ్యేది? వాడు తలకాయ ఉండి మాట్లాడుతున్నారా. వంద అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చారు. అరె పిచ్చి కేటీఆర్.. చేసేదే చెప్పాము. మీలాగా అమలు కానీ హామీలు ఇవ్వలేదు. ఎంత కష్టం అయినా నెల మొదటి రోజే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నాం. కేటీఆర్, హరీష్‌కు ఏం పుట్టింది మీకు రాజకీయాలు వస్తాయా.. అసెంబ్లీ, పార్లమెంట్ లో ఓడిపోయిన బీఆర్ఎస్ వాళు వేరే దేశానికి వెళ్లి బ్రతుకుతారు అనుకున్నా.. కానీ సిగ్గు లేకుండా రోడ్ల మీద తిరుగుతున్నారు‘ అంటూ ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. నల్గొండలో అనారోగ్యం బారిన పడిన వారు చాలా మంది ఉన్నారని.. ఎన్నో వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎస్‌టీపీలతో సమస్య పరిష్కారం కాదని.. స్వచ్ఛమైన నీరు ఇవ్వాలని మంత్రి తెలిపారు. ఫ్లోరైడ్ కు శాశ్వత పరిష్కారం ఎస్ఎల్‌బీసీ అని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ, మూసీ శుద్ధీకరణ విషయంలో ముఖ్యమంత్రిని అభినందుస్తున్నట్లు తెలిపారు. ఒక వైపు ఎ÷–లోరైడ్, మరోవైపు కోటిన్నర మంది వాడిన నీరు నల్గొండలో పారుతోందన్నారు. గత ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీలో 5 వేల కోట్లు దోచుకుతిన్నారని మండిపడ్డారు. కేసీఆర్ కొడుకు అంటే గుర్తు పడతారు కానీ.. కేటీఆర్ అంటే ఎవరూ గుర్తు పట్టరంటూ వ్యాఖ్యలు చేశారు. అధికారం కోల్పోయినా అహం తగ్గలేదన్నారు. ప్రపంచంలో అన్ని దేశాలు తిరిగి వేల కోట్లు సంపాదించి ఎక్కడ పెట్టుకోవాలో తెలియని డబ్బులు సంపాదించారంటూ మండిపడ్డారు. కేటీఆర్.. నల్గొండ మంత్రులు రెచ్చగొడితే రెచ్చి పోరని, స్వతహాగా పౌరుషం ఉన్న వ్యక్తులమని స్పష్టం చేశారు. అసలు కేటీఆర్, హరీష్ రావులు నాయకులే కాదని అన్నారు. అన్నింటిలో భాగస్వామ్యాలు ఉన్నాయని..



నారాయణ సంస్థల్లో హరీష్‌కు వాటా ఉందని తెలిపారు. కిషన్ రెడ్డికి ఏమీ తెలియదని.. ఆయన గురించి మాట్లాడం వేస్ట్ అంటూ కామెంట్స్ చేశారు. ఆయన రాజకీయ నాయకుడు కాదన్నారు. కేటీఆర్, హరీష్ దొంగలని... అందుకే వాళ్ళ విషయాలు అందరికీ తెలియాలని మాట్లాడుతున్నానన్నారు. అమెరికా వెళ్లి ప్రభాకర్ రావును కలిసి కాళ్ళు పట్టుకుని మరీ ఇండియాకు రావొద్దని బ్రతిమిలాడినట్లు తెలిపారు. కేటీఆర్, హరీష్ రావులకు నల్గొండ వాళ్లంటే ఎందుకు అంత కోపమని ప్రశ్నించారు. ‘విషం పెట్టి చంపండి, లేదంటే మేమే చచ్చి పోతాం‘ అంటూ వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్, హరీష్ మూసీ ప్రజలను రెచ్చ గొడుతున్నారుని.. వాళ్ళ ఇంటి వద్ద ఎక్కడపడితే అక్కడ శాంతియుత పద్ధతిలో నిరసన చెబుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు.

# పల్లె ప్రాంతాల పండుగ అట్ల తద్ది - తెలుగు ఆడపిల్లల ఆటవిడుపు



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494



ఆంధ్ర దేశ విశిష్ట సాంప్రదాయాల్లో 'అట్లతద్ది' జరుపుకోవడం ఒకటి. మనం జరుపు కునే అట్లతద్ది పండుగ ఉత్తర భారత దేశ స్త్రీలు చేసుకునే 'కార్వా చౌత్' వేడుకతో సమానం. రోమ్ లో కూడా ఇలాంటి ఆచారం ఉంది. జనవరి 20, 21వ తేదీన వచ్చే 'సెయింట్ ఆగ్నెస్ ఈవ్' మన అట్లతద్ది పండుగ లాగే ఉంటుంది. పార్వతీదేవి (గౌరీ) శివుని భర్తగా పొందాలని కోరు కోగా, నారదముని విషయం తెల్సుకుని వచ్చి ఆమె కోరిక ఫలించడానికి "అట్లతద్ది వ్రతం" చేయ మని చెప్పాడు. పార్వతీ దేవి ఈ అట్లతద్ది వ్రతం చేసి మహాదేవుని భర్తగా పొందు తుంది. పార్వతిదేవి తొలుత చేసిన విశిష్టమైన వ్రతమే ఈ అట్లతద్ది. స్త్రీలు సౌభాగ్యం కోసం చేసుకొనే వ్రతం. తెలుగునాట మహిళలకే ప్రత్యేకమైన పండు గల్లో 'అట్ల తద్ది' ఒకటి. వివాహి తలు సౌభాగ్యాన్నీ, పెళ్ళి కావలసిన అమ్మాయిలు మంచి వరుడినీ ఆశిస్తూ చేసుకొనే వేడుక ఇది. ఆడవాళ్ళు తమ భర్తలు ఆయురా రోగ్యాలతో పదికాలాల పాటు సుఖంగా, సంతోషంగా ఉండాలని కోరుకుంటూ అట్లతద్ది జరుపు కుంటారు. పశ్చిమ దేశాల ప్రభావం తో 'అట్లతద్ది' లాంటి సంప్రదాయ పండుగలు జరుపుకునే ఆచారం సన్నగిల్లు తున్నప్పటికీ ఇంకా ఈ సంప్రదాయం మరుగున పడలేదు.

ఇప్పటికీ చాలామంది పెళ్ళ యిన స్త్రీలు 'అట్లతద్ది' జరుపు కుంటున్నారు. అట్ల తదియ లేక అట్లతద్ది పల్లె ప్రాంతాల తెలుగు వారి పండుగ. ఇది ఆశ్వయుజ బహుళ తదియ నాడు చేసు కుంటాం. పల్లె ప్రాంతాల్లో తెలుగింటి ఆడపడుచు లంతా తెల్లవారు ఝామున లేచి శుభ్రంగా తల స్నానం చేసి ఉపవాసంతో ఇంటిలో తూర్పున మంటపాన్నీ ఏర్పరచి గౌరీదేవిని ప్రతిష్టిస్తారు. ముందుగా వినాయకుని పూజించి, ఆయన తల్లి ఐన గౌరీదేవిని స్తుతించి, పాటలు పాడుతారు. సాయంత్రం వరకూ ఉపవాసం ఉండి, ఆకాశంలో చంద్రోదయ మయ్యాక మరలా గౌరీమాతను పూజించి,' త్రిదశ పరివృతాం సేవితాం సిద్దికామైః' - అంటూ స్త్రీలంతా అట్లను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి ప్రార్థిస్తారు. పదిమంది ముత్తైదు వులకు బొట్టు, కాటుక ఇచ్చి, పాదాలకు పసుపు రాచి, ఒక్కోరికీ 11 అట్లు, 11 పండ్లు వాయనంగా ఇస్తారు. "ఇస్తినమ్మ వాయనం", అంటూ చీరకొంగుతో పళ్ళెం పట్టుకుని ముత్తైదువుకు ఇస్తూ అంటారు,

ముత్తైదువ "పుచ్చుకుంటినమ్మ వాయనం" అంటుంది. ఇలా మూడు మార్లు అన్నాక " నా వాయనం పుచ్చుకునే దెవరూ" అని అంటే ఆ ముత్తైదువ " నేనే గౌరీదేవిని, కోరిన కోరికలన్నీ తీరుస్తాను" అంటుండగా ఆమెకు నమస్కరించి, అక్షతలు శిరస్సున వేయించుకుని, అట్లతద్ది నోము కథ చెప్పు కుంటారు. పది పువ్వుల ముడితో తోరం కట్టుకుంటారు. చిన్న అమ్మాయిలు, కన్నె పిల్లలంతా సూర్యోదయానికి ముందే స్నానాలు చేసి చద్దన్నం, గోంగూర పచ్చడి, నువ్వుల పొడి, గడ్డ పెరుగుతో కడుపు నిండా తిని తాంబూలం వేసుకుని చేతులూ, కాళ్ల మాదిరి గానే నోరును కూడా ఎర్రగా పండించు కుంటారు. ఆ తరువాత తిన్నది జీర్ణమయ్యే దాకా ఆట లాడుతూ, తోటల్లో చెట్లకు వేసుకున్న ఊయ్యాలలు ఊగుతూ' 'అట్లతద్దోయ్ ఆరట్లోయ్ - ముద్ద పప్పోయ్ మూడట్లోయ్' అంటూ పాటలు పాడుతూ ఆనందంగా గడుపుతారు. కొందరు అవకా శాన్ని బట్టి ముత్తైదువులకు నల్లపూసలు, లక్కకోళ్ళు, రవిక గుడ్డలు, దక్షిణ తాంబూలాలు ఇచ్చి భోజనాలు పెట్టిన తర్వాత తాముా భోజనము చేస్తారు.

ఈపండుగలో విశేష మేమంటే 11 రకాల పళ్లు తినడం,11 సార్లు తాంబూలం వేసుకోడం,11 సార్లు ఉయ్యాల ఊగడం, గోరింటాకు పెట్టు కోవడం, ముఖ్య ఘట్టాలు. దీన్ని 'ఉయ్యాల పండగ' అనీ, 'గోరింటాకు పండగ' అనీ కూడా అంటారు. ఈ పండగ చేయడం వలన గౌరీదేవి అనుగ్రహంతో పెళ్ళి కాని అమ్మాయిలకు మంచి సుగుణాలు కలిగిన వ్యక్తి భర్తగా వస్తాడనీ, పెళ్ళైన వారికి పిల్లలు కలుగుతారని, ముత్తైదు తనం జీవితాంతం ఉంటుందనీ, పుణ్యం వస్తుందనీ విశ్వాసం. కన్నె పిల్లలంతా ఆడ పడుచు లకు బంధు వులకు ఇరుగు పొరుగులకు వాయినాలిస్తారు. సాయకాలం గోపూజ చేస్తారు. చెరువులో కానీ కాలువలలో కానీ నదుల్లో కానీ దీపాలను వదుల్తారు. ముందు రోజు రాత్రే అరచేతులకు గోరింటాకు పెట్టుకుని, ఉదయాన్నే బాగా పండిందాని చూసు కుంటారు. ముందు రోజు నుంచే పండుగ హడావిడి మొదలవు తుంది. ఒక్క గోరింట చెట్టుకూ ఆకులు మిగలకుండా కోసుకుని రోట్లో వేసి రుబ్బుకుంటారు. అన్నిట్లోనూ పోటీలే. ఇలా గోరింటాకు పెట్టుకోడంలో ఆరోగ్య సూత్రం కూడా ఉంది. పూర్వం మహిళలు పని చేసేప్పుడు ఎక్కువగా నీటిలో చేతులు, కాళ్ళు తడిసేవి.

ఇలా గోరింటాకు పెట్టుకోడం వలన గోరింటలోని వ్యాధి నిరోధక శక్తివలన శరీరం చల్లబడి వివిధ రకాల క్రిముల వలన వేళ్ళకు, గోళ్ళకు, అరికాళ్ళకు కలిగే సమస్యల నుండి రక్షణ లభిస్తుంది. గోళ్ళు పుచ్చవు. ఇది స్త్రీలు సౌభాగ్యం కోసం చేసుకునే వ్రతంగా చెప్తారు. వివాహం కాని అమ్మాయిలు పూర్వం గ్రామాల్లో తప్పనిసరిగా మంచి భర్తకోసం ఈవ్రతాన్ని చేసేవారు. ఈవ్రతంలో చంద్రారాధన ప్రధానమైన పూజ. చంద్రకళల్లో కొలువై వున్న శక్తి అనుగ్రహం చేత స్త్రీసౌభాగ్యము పెరుగుతుంది. కుటుంబములో సుఖ శాంతులు స్థిరంగా ఉంటాయి. ఈ పండగలో అమ్మవారికి అట్లు నైవేద్యముగా పెట్టడములో ఒక అంతర్థాం కూడా ఉంది. నవగ్రహాల లోని కుజునికి అట్లంటే మహా ప్రీతి! అట్లను ఆయనకు నైవేద్యముగా పెడితే కుజదోష పరిహారమై సంసార సుఖములో ఎటువంటి అడ్డంకులు రావన్న విశ్వాసం. రజోదయమునకు కారకుడు కనుక ఋతుచక్రం సరిగా వుంచి ఋతు సమస్యలు రానివ్వకుండా కాపాడుతాడు. అందువలన గర్భ ధారణలో ఎటువంటి సమస్యలు ఎదురవ్వవు. మినప్పిండి, బియ్యప్పిండి కలిపి అట్లను తయారు చేస్తారు. మినుములు రాహువునకు, బియ్యము

చంద్రునకు ఇష్టమైన ధాన్యాలు. గర్భ దోషాలు తొలగి పోవాలం టే ఈ అట్లనే వాయనముగా ఇవ్వాలి. గర్భస్రావము రాకుం డా, సుఖ ప్రసవం అయ్యేందుకు కూడా ఈ అట్లదానం దోహద పడుతుందని అంటారు. ముత్తైదువులకు అట్లను వాయనముగా ఇవ్వటం, వారి పాదాలు పట్టుకుని పసుపు రాయటం, గౌరవించడం వంటి పనుల వలన దానగుణం పెంచడంతో పాటుగా సమా నత్వం , స్వార్థ రాహిత్యం కూడా పెరుగుతాయి. అట్లతద్ది లోని 'అట్ల'కు ఇంతటి వైద్య విజ్ఞానం నిక్షిప్తం చేయబడి వుంది.

## అస్సాం ఒప్పందం సెక్షన్ 6( ఎ) సమర్థనీయం



సెక్షన్ 6( ఎ) మీద నిన్న సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు చాలా కీలకమైంది. గౌరవ భారత ప్రధాన న్యాయమూర్తి డి వై చంద్రచూడ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ సుందరేస్, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ పార్థివాలా నేతృత్వంలోని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గురువారం నాడు 4:1 మెజారిటీ తీర్పుతో అస్సాంలోని అక్రమ వలసదారులకు భారత పౌరసత్వం మంజూరుకు సంబంధించిన పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6(ఎ) రాజ్యాంగ చెల్లుబాటును సమర్థించింది. అసోం ఒప్పందం అక్రమ వలసల సమస్యకు రాజకీయ పరిష్కారమని రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. జస్టిస్ జె బి పార్థివాలా మాత్రం ఈ సెక్షన్ ఏకపక్షంగా ఉందని రాజ్యాంగ పరంగా చెల్లుబాటు కాదంటూ మైనారిటీ తీర్పు ఇచ్చారు.

**సెక్షన్ 6( ఎ) అంటే ఏమిటి ?**

1985 నాటి అస్సాం ఒప్పందాన్ని అనుసరించి 1985 పౌరసత్వ (సవరణ) చట్టంలో భాగంగా సెక్షన్ 6 (ఎ) రూపొందించబడింది . అస్సాం ఒప్పందం అనేది 1985లో అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం, ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్, ఆల్ అస్సాం గణ సంగ్రామ్ పరిషత్ చర్చలు జరిపి అస్సాం ఒప్పందాన్ని రూపొందడం జరిగింది. అస్సాం స్టూడెంట్స్ యూనియన్ , ఆల్ అస్సాం గణ సంగ్రామ్ పరిషత్ లు 26 మార్చి 1971న పశ్చిమ పాకిస్తాన్ నుండి బంగ్లాదేశ్ విడిపోయిన తర్వాత బంగ్లాదేశీ వలసదారుల ప్రవాహానికి వ్యతిరేకంగా ఉద్యమించిన సమూహాలు.

ఈ త్రైపాక్షిక ఒప్పందం సెక్షన్ 6(ఎ )అస్సాం కోసం ఒక ప్రత్యేక నిబంధనను రూపొందించింది. పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6 (ఎ) ప్రకారం 1 జనవరి 1966 నుండి 25 మార్చి 1971 మధ్య భారతదేశంలోకి ప్రవేశించి అస్సాంలో నివసిస్తున్న వ్యక్తులు తమను తాము పౌరులుగా నమోదు చేసుకోవడానికి అనుమతించబడతారు. రాష్ట్రంలో "సాధారణంగా నివాసం" ఉన్న విదేశీయులు 10 సంవత్సరాల పాటు ఓటు వేయలేరు తప్ప భారతీయ పౌరుల అన్ని హక్కులు, బాధ్యతలను కలిగి ఉంటారు.

**కట్-ఆఫ్ తేదీ ఎందుకు అవసరం?**

పాకిస్తాన్ నుండి బంగ్లాదేశ్ స్వాతంత్ర్యానికి దారితీసిన బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం, భారతదేశానికి వలస వచ్చినవారి భారీ ప్రవాహాన్ని చూసింది. 1971లో తూర్పు పాకిస్తాన్ నుండి బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం పొందే ముందు కూడా భారతదేశానికి వలసలు మొదలయ్యాయి. అందుచేత ఈ కట్ ఆఫ్ తేదీ అవసరం.

**పౌరసత్వ చట్టం 1955 అంటే ?**

భారతదేశంలో పౌరసత్వ విషయాలను నియంత్రించేందుకు పార్లమెంటు పౌరసత్వ చట్టం 1955ను రూపొందించింది. ఇది భారత పౌరసత్వాన్ని ఎవరు పొందవచ్చో, ఏ ప్రాతిపదికన పొందవచ్చో నియంత్రిస్తుంది. అక్రమ వలసదారులు భారత పౌరసత్వం పొందడం నిషేధించబడింది. పౌరసత్వ చట్టం - 1955 అమలులోకి వచ్చినప్పటి నుండి ఆరుసార్లు సవరించబడింది. 1986, 1992, 2003, 2005, 2015, 2019 సంవత్సరాల్లో సవరణలు జరిగాయి. చివరిసారిగా 2019లో తాజా సవరణ ఏంటంటే " 31 డిసెంబర్ 2014లో లేదా అంతకు ముందు భారతదేశంలోకి ప్రవేశించిన ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ నుండి హిందూ, సిక్కు, బౌద్ధ, జైన్, పార్సీ, క్రైస్తవ వర్గాలకు చెందిన కొంతమంది అక్రమ వలసదారులకు పౌరసత్వం మంజూరు చేయబడింది. "

**కీలకం ఎందుకు ?**

ఈ తీర్పు చాలా కీలకమైంది. మిగతా రాష్ట్రాల కంటే అస్సాంలో ఎక్కువ వలసలు ఉన్నాయి. అక్రమ వలసలకు అస్సాం ఒప్పందం రాజకీయ పరిష్కారాన్ని చూపింది. కేవలం అస్సాంకే ఈ నిబంధన ఉండడం కీలకం.

జనక మోహన రావు దుంగ
9440485824

# వచ్చే నెలలో అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు

## ఇప్పటి నుంచే ఏర్పాట్లపై టిటిడి దృష్టి

తిరుచానూరు,అక్టోబర్19 (ప్రజామంటలు):

శ్రీవారి పట్టపురాణి శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు వేళయింది. ఏటా కార్తీక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతాయి. నవంబర్ 28 నుండి డిసెంబర్ 6 వరకు జరిగే శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు తిరుచానూరు ముస్తాబు అవుతోంది. అమ్మవారి బ్రహ్మోత్సవాలకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టిన టిటిడి పనుల్లో నిమగ్నమైంది. ఈ మేరకు బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులతో కలిసి ఏర్పాట్లను టిటిడి జెఈవో వీరబ్రహ్మం పరిశీలించారు. అమ్మవారి ఆలయం, పుష్కరిణి, మాడవీధులు, నవజీవన్ కంటి ఆసుపత్రి సమీపంలోని ఖాళీ స్థలం, ఘంటసాల సర్కిల్, హైస్కూల్ పరిసరాలు, పసుపు మండపం, పూడి రోడ్డు తదితర ప్రాంతాలను జేఈఓ వీరబ్రహ్మం పరిశీలించారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు అమ్మవారి మూలమూర్తి దర్శనంతో పాటు వాహన సేవలు వీక్షించేలా టిటిడి లోని అన్ని విభాగాలు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. బ్రహ్మోత్సవాలలో చివరి రోజైన పంచమి తీర్థం లో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం పూడి రోడ్డు, రేణిగుంట, మార్కెట్ యార్డ్ ప్రాంతాల్లో స్థలాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా భక్తులు సేదతీరేందుకు నవజీవన్ కంటి ఆసుపత్రి, హైస్కూలు, పూడి రోడ్డులోని గోశాల వద్ద జర్మన్ షెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పుష్కరిణిలోకి వెళ్లేందుకు, తిరిగి వచ్చేందుకు తగిన విధంగా గేట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. తమిళనాడు భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు అర్థం అయ్యేలా తమిళ భాషలోనూ సైన్ బోర్డులు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు జేఈఓ వీరబ్రహ్మం. ఇక అమ్మవారి బ్రహ్మోత్సవాలలో భద్రతా పరంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకొని పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు టిటిడి సివిఎస్వో శ్రీధర్ తెలిపారు.పంచమి తీర్థం రోజున భక్తులు సేద తీరేందుకు ఏర్పాటు చేసే షెడ్లలో, క్యూలైన్లు, పుష్కరిణి వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. అదేవిధంగా తిరుమల నుంచి పసుపు ఊరేగింపు మార్గాలను ముందే పరిశీలించి ఆ మార్గంలో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను టిటిడి సిఈ సత్యనారాయణ, ఎస్ఈ జగదీశ్వర్ రెడ్డి, ఎస్ఈ ఎలక్ట్రికల్ వెంకటేశ్వర్లు తో పాటు పలువురు అధికారులు కూడా పర్యవేక్షించారు.

# కక్షసాధింపు కేసులతో మసకబారుతున్న ప్రభ !

రాజకీయ అవినీతిపై మోడీ తన పదేళ్ల పాలనలో ఒక్క నేతపైనా కేసును రుజువు చేయించలేక పోయారు. కేవలం విచారణలు, జైళు ,, బెయిళ్లు లాగా కథ నడుస్తోంది. మొన్నటికి మొన్న ఆప్ నేత సత్యేంద్ర జైన్ దాదాపు రెండేళ్ల తరవాత జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. అంతకుముందు సిసోడియా, కేజ్రీవాల్, కవిత, హేమంత్ సోరెన్ వంటి వారు కూడా బెయిల్‌పై వచ్చారు. ఈ అందరిలో ఒక్కరిపైనా కేసులు రుజువు కాలేదు. దీనినిబట్టి ఇడి, సిబిఐల సమర్థతపైనా అనుమానాలు వస్తున్నాయి. అంతేగాకుండా ఇవన్నీ కూడా కేవలం రాజకీయ కక్షసాధింపు కేసలుగానే ప్రజలు ఆలోచిస్తున్నారు. నిజానికి అవినీతి కేసుల్లో నిక్కచ్చిగా వ్యవహరించడడం లేదు. బెయిల్‌పై ఉన్న జగన్ ఎపిని అడ్డగోలుగా ఐదేళ్లు పాలించి, అక్రమాలకు పాల్పడ్డా కేసులు లేకుండా పోయాయి. కెసిఆర్ కుటుంబం అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డా కనీసం ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. ఇలా నేతల అవినీతిపై ఆరోపణలు చేసింది సాక్షాత్తు ప్రధాని మోడీయే. అయినా అవి విచారణకు నోచుకోలేదు. ఒక్కరు కూడా శిక్షార్హులు కాలేదు. దీనికంతటికీ కేసుల్లో బలం లేకపోవడం లేదా చిత్తశుద్ధి లోపించడం వటంటి కారణాలు కావచ్చు. రాజకీయాల్లో నిజాయితీ ఉండాల్సిందే. అవినీతిని దునుమాడాల్సిందే. నీతిమాలిన పనులు చేయకుండా చూసుకోవాలి. అవినీతికి పాల్పడే నేతలను శిక్షించాల్సిందే. అందుకు ఎవరు కూడా మినహాయింపు కారాదు. కానీ జరుగుతున్న తంతు చూస్తుంటే.. అందుకు భిన్నంగా ఉంది. రామరాజ్యం పేరుతో..ప్రవచనాలు పలికిన ప్రధాని మోడీ తీసుకుంటున్న నిర్ణయాలు మాత్రం పూర్తి పక్షపాతంగా ఉంటున్నాయి. కేజ్రీవాల్, సిసిఓడియా, సత్యేంద్ర జైన్, జార్ఖండ్ సిఎం హేమంత్ సోరేన్ లాంటి వారిని వేటాడి వెంటాడి ఇడి వేధించిన తీరుతో ఒరిగిందేమీ లేదు. కేసుల్లో బలం లేకపోవడం, రుజవులు సంపాదించకపోవడం, కేవలం వేధింపు చర్యగానే చూడాలి. అలాగే తెలుగు రాష్ట్రాల్లో అవినీతి ముఖ్యమంత్రులుగా రాజ్యమేలిన కెసిఆర్, జగన్‌లను మాత్రం ఏమీ చేయలేకపోయారు. ఇక్కడ వీరిని ట్రంప్ కార్డుల్లా వాడుకున్నారు. రేపు ఏ అవసరం వస్తుందో అన్న భయంలో కాపాడుకుంటూ వచ్చారు. అయితే అవినీతి, అహంకారానికి పాల్పడిన కెసిఆర్ కుటుంబంపై రంకెలు వేసిన ప్రధాని మోడీ ఆయనపైనా, కూతురు కవితపైనా ఎలాంటి చర్యలకు ఉపక్రమించలేదు. కవితను అరెస్ట్ చేసి జైలులో పెట్టినా కేసు నిలబడలేదు. దీంతో ప్రజలే తీర్పును ఇచ్చారు. అందుకే ప్రజలు తీర్పు ఇచ్చి అవినీతికి పాల్పడ్డ కెసిఆర్, జగన్‌లను అధికారానికి దూరం చేశారు. ఐదేళ్లపాటు ఎపిలో జగన్ బెయిల్‌పై ఉన్నా మోడీ పట్టించుకోలేదు. కేసులు ఏవీ ఆయనను ఏమీ చేయలేదు. ఇదంతా మోడీ ప్రాపకం వల్లనే అని చెప్పాల్సిన అవసరం లేదు. కానీ జార్ఖండ్‌లో మాత్రం అలా జరగలేదు. మోడీ ప్రభుత్వం సాగిస్తున్న కుతంత్రాలకు జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ ప్రభుత్వం బలైంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి)ని ప్రయోగించి ఏకంగా ముఖ్యమంత్రినే అరెస్టు చేయించింది. ఢిల్లీ, జార్ఖండ్‌లలో సిఎంలను అరెస్ట్ చేయించి మోడీ చరిత్ర సృష్టించారు. ఈడీ చర్యల కారణంగా దానికి ఉన్న ప్రతిష్ట దిగజారింది. సిబిఐ ప్రతిష్టా దిగజారింది. ఈ రెండు సంస్థలు దర్యాప్తులో పెద్దగా పురోగతి సాధించలేక పోతున్నాయి. ఎపిలో వైఎస్ వివేకనందరెడ్డి హత్య కేసును ఛేదించలేక పోయారు. ఈడీ అధికారుల చర్యల కారణంగా తాము, తమ కుటుంబం బాధపడ్డామనీ, తీవ్రమైన మనో వేదనను ఎదుర్కొన్నామనీ కేసులు ఎదుర్కొన్న నేతలు వ్యాఖ్యానించారు. ఇకపోతే కెసిఆర్, జగన్‌లకు లేని వేధింపులు జార్ఖండ్‌లో సోరేన్‌కు మాత్రమతప్పలేదు.

ప్రజలు ఇలాంటి దర్యాప్తులపై ఆలోచించాలి. గతంలో అసోం సిఎం హిమంత్ బిశ్వశర్మ కూడా ఇలాగే ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బిజెపిలో చేరాక అవినీతి కేసులు మాయమయ్యాయి. తాజాగా సిబిఐ, ఈడీ,

బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకత వస్తోంది. . నిజానికి కుంభకో ణాలకు, అవినీతికి పాల్పడ్డ వారు ఎంతటి వారైనా శిక్షకు గురి కావాల్సిందే. కానీ కొందరిని మాత్రమే టార్గెట్ కావడం...కేవలం ఎన్‌డిఎ గూటిలో లేని వారికే వేధింపులు రావడం గమనించవచ్చు. రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల నేతలు చేస్తున్న అవినీతిపై చర్యలు తీసుకోవాల్సిందే. అప్పులకుప్పగా చేసి,దివాళా తీయించిన తెలంగాణ మాజీ సిఎం కెసిఆర్ విషయంలో మోడీ ప్రేమ చూపడం సరికాదు. ఢిల్లీ మద్యం స్కామ్‌లో ఉన్న వారినెవరినీ వదలబోమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలంగాణలో జరిగిన ఎన్నికల సభల్లో ప్రకటించారు. లిక్కర్ స్కాంలో ఫోన్లు మార్చి డబ్బు తీసుకున్న బీఆర్ఎస్ నేతలు కూడా జైలుకు వెళ్లే సమయం తప్పకుండా వస్తుందని హెచ్చరించినా చర్యలు మాత్రం తీసుకోలేదు. ఎందుకంటే కవిత జైలుకు వెళ్లడం, బెయిల్‌పై రావడం తప్ప దర్యాప్తులో పురోగతి లేదు. ఈ దేశంలో ఎవరైనా నేరం చేస్తే శిక్ష పడేలా చేసే హక్కు న్యాయస్థానాలకే కాని ప్రభుత్వాలకు ఉండదు. ఢిల్లీ మద్యం స్కామ్ ఇప్పటికే సుప్రీంకోర్టు విచారణలో ఉన్నది. మనీలాండరింగ్ చట్టాన్ని నిర్విచక్షణగా అమలు చేయడం పట్ల సుప్రీంకోర్టు ఇప్పటికే అనేక అభ్యంతరాలను వ్యక్తం చేసింది. అయినప్పటికీ ప్రధానమంత్రి స్వయంగా తాను రాజకీయ ప్రత్యర్థులను శిక్షిస్తానని బహిరంగ సభల్లో ప్రకటించారు. అవినీతిపరులను జైలుకు పంపిస్తామని ప్రకటించిన మోదీ ప్రాజెక్టుల్లో అవినీతి, నిరుద్యోగం, ధరణి పేరిట అక్రమాలు, ఫామ్ హౌజ్‌లో విశ్రమించడం, మూఢ నమ్మకాలు వంటి అనేక అంశాలను తెలంగాణలో నాటి సిఎం కెసిఆర్ విషయంలో ప్రస్తావించారు. కానీ ఒక్కటంటే ఒక్క చర్య తీసుకోలేదు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒకటేనన్న ప్రచారం ఇప్పటికీ సాగుతోంది. ఇలా రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేయడం సరికాదు. ఇప్పటికైనా సిబిఐ,ఇడిలను పటిష్టం చేయాలి. రాజకీయాలకు దూరంగా స్వతంత్రంగా అవి పనిచేసుకునేలా చేయాలి. అప్పుడే అవినీతి నేతలకు వణుకు పుడుతుంది.

### ఆలయాలపై దాడులు చేసే వారిని కఠినంగా శిక్షించాలని

# హిందూ సమాఖ్య ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతి



కోరుట్ల అక్టోబర్ 19 (ప్రజా మంటలు ): తెలంగాణ రాష్ట్రంలో కొన్ని నెలలుగా ఆలయాలలో అన్య మతస్తులు ప్రవేశించి దేవి దేవత విగ్రహాలను ధ్వంసం చేయడమే కాకుండా విచిత్ర ప్రవర్తనతో ఫొటోస్ వీడియోస్ పంపించి హిందువుల ఆరాధ్య దైవాలను అవమానించి వారి మనోభావాలను దెబ్బతీస్తున్నారని, అలాంటి వారిని తక్షణమే పట్టుకొని కఠినంగా శిక్షించాలని కోరుట్ల హిందూ సంఘాల ఆధ్వర్యంలో శనివారం రెవెన్యూ డివిజనల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. మొన్న హైదరాబాద్ లో హిందువులు పరమ పవిత్రంగా భావించే దేవి దేవతల విగ్రహాలను ధ్వంసం చేసిన వారిపై తక్షణమే చట్టరీత్య చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హిందువులు ఆలయాలను పంచభూతాలను పూజిస్తూ అనాదిగా సైన్స్ కు మూలం అని వాస్తవం గ్రహించి అంతుబట్టలేని ఆనందం ఆరోగ్యం ఆలయాల చెంత ఉందని, అందుచేతనే విగ్రహారాధన దేవి దేవతలను ఆరాధించడం ధర్మరక్షణ కోసం పాటుపడుతున్నామని, మేము ఇప్పుడు ఇతర మతాల వారిని కించపరచలేదని అలాంటిది మా దేవి దేవతలపై ఆలయాలపై దాడులు, ధ్వంసం చేస్తే సహించేది లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా హిందువుల దేవి దేవతలపై దాడులు జరిగిన హిందూ సమాజానికి ఎక్కడ అన్యాయం జరిగినా వాస్తవాలు తెలుసుకొని కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గజం రాజు, గట్ల శివ, మడవేణి నరేష్, వెంకటేష్, సూదవేణి మహేష్, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, భారతీయ జనతా పార్టీ, సనాతన ఐక్యవేదిక నాయకులు, హిందూ బంధువులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురిలో అమర వీరులకు సంస్కరణకు ఏర్పాట్లు

(రామ కిష్టయ్య సంగన భట్ల)

ధర్మపురి అక్టోబర్ 19 (ప్రజా మంటలు) : విధి నిర్వ హణలో అసువులు బాసిన పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఏటా అక్టోబర్ 21న జరుపుకునే క్రమంలో సోమ వారం ధర్మపురి క్షేత్రంలో కార్యక్రమ నిర్వహణకు పోలీసు శాఖ ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమైనారు. కరీంనగర్ పాత జిల్లాలోనే ప్రప్రథమంగా పోలీసు స్టేషన్ బయట ప్రజా సహకారంతో నిర్మించిన పోలీసు అమర వీరుల స్థూపాన్ని 2005 సంవత్సరంలో అక్టోబర్ 21వ తేదీన లాంఛనంగా ఆవిష్కరించారు. వీపుల్స్ వార్ ఉద్యమ చరిత్రలో రాష్ట్రం లోనే ప్రప్రథమంగా ధర్మపురి క్షేత్ర నడిబొడ్డున సాయుధ ఆర్మ్డ్ రిజర్వ్ కానిస్టేబుల్ కోమల్ రెడ్డిని (ఏ. ఆర్ కానిస్టేబుల్ 1072) 1985, జూలై 23 న హతమార్చడం జరిగింది. 2004 సంవత్సరం నిర్వహించిన అమర వీరుల వారోత్సవాల సందర్భంగా, ప్రజా ప్రతినిధులు, నాయకులు చేసిన సూచనలను అనుసరించి, క్షేత్రంలో పోలీసు అమర వీరుల స్మృత్యర్థం స్థూపాన్ని నిర్మించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో, 2005లో అమరవీరుల సంస్మరణ దినమైన అక్టోబర్ 1వ తేదీన, అమర పోలీసుల స్థూపాన్ని ఆవిష్కరించేందుకు పోలీసు అధికారులు ఘనంగా ఏర్పాటు చేశారు.. ఈ ప్రాంతంలో హింసలో అసువులు బాసిన పోలీసులు నిరంతరం స్మరణకు వచ్చేలా సదరు నిర్మాణ కార్యక్రమాన్ని నాటి సర్కిల్ ఇన్స్పెక్టర్ దామెర నర్సయ్య, సబ్ ఇన్స్పెక్టర్ కట్ట హరిప్రసాద్ ఆధ్వర్యంలో లాంఛనంగా ప్రారంభించగా, 2005లో సిఐ నల్ల మల్లారెడ్డి చొరవతో, ఎస్ఐ కోటేశ్వర్ సిబ్బంది నిర్మాణ పనులను పూర్తి గావించారు. నాటి సిఐ మల్లారెడ్డి స్థూపావిష్కరణ చేశారు. రాష్ట్రం లోనే ప్రప్రథమంగా తీవ్రవాదులచే ధర్మపురి క్షేత్ర నడిబొడ్డున , బస్






స్టేషన్ సమీపాన, 1985 జూలై 23వ తేదీన పీపుల్స్ వార్ చే కాల్చి చంపబడిన సాయుధ కానిస్టేబుల్ చల్ల కోమల్ రెడ్డితో పాటు ధర్మపురి మండలంలోని నేరేళ్ళ మరియు సారంగాపూర్ మండలంలోని బట్ట పెల్లి – పోతారం మధ్య రోడుపై 1993 అక్టోబర్ 12వ తేదీన పీపుల్స్ వార్ తీవ్రవాదులు పేల్చిన మందు పాతరలో మృతి చెందిన సారంగాపూర్ స్టేషన్ కు చెందిన హెడ్ కానిస్టేబుల్ (శ్రీనివాస్ 1515), అదే స్టేషన్లో పని చేసిన శ్రీనివాస్ (పిసి 2290), జగి త్యాల టౌన్లో పనిచేసిన ప్రకాశ్ (పిసి 818) జగిత్యాల రూరల్ పోలీసు స్టేషన్లో పనిచేసిన రాజయ్య (పిసి176) ల సంస్మరణార్థం వారి పేర్లు చెక్కిన, ఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఈఏడూ ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాం నర్సింహ రెడ్డి మార్గదర్శకత్వంలో, సబ్ ఇన్స్పెక్టర్ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ సమీపంలోని అమర వీరుల స్తూపం వద్ద పోలీసులు సంస్మరణ దినాన్ని ఘనంగా జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# మీడియా రంగంలో విశేష కృషికి ఉత్తమ అవార్డులు



పెద్దపల్లి అక్టోబర్ 19 (ప్రజా మంటలు) : జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ధర్మపీఠం విశ్వ మానవ వికాస కేంద్రం ఆధ్యర్యంలో డిజిటల్ పత్రిక, ప్రింటి మీడియా, సోషల్ మీడియా, యుట్యూబ్ రంగాల్లో విశేష కృషిచేస్తున్న విలేకరు-జర్నలిష్టు, ఎడిటర్ లకు ప్రశంసా పత్రాలను , అవార్డులను ఇవ్వాలని నిర్ణయించారు. ఆయారంగాల్లో ఒకరికి అవార్డు జిల్లాల వారిగా ఒకరికి ప్రశంస పత్రం ఇవ్వడం జరుగుతుంది. మానవీయ కోణంలో ఆలోచించి సమాజ ప్రయోజనాలే పరమావధిగా వార్త కథనాలు రాసి ప్రచురించిన,సోషల్ మీడియా యూ ట్యూబ్ లొ ప్రసారం చేసిన వారి కృషికి రాష్ట్రస్థాయిలో "ధర్మపీఠం" అవార్డులు, తెలంగాణలోని ముప్పై మూడుజిల్లాల నుంచి ఒక్కొక్కరికి ఉత్తమ ప్రశంస పత్రం ఇస్తామని దర్మపీఠం విశ్వమానవ వికాస కేంద్రం ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామంలో సేవాతత్పరుడు కూచన మల్లయ్య మహర్షి ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ఏలాంటి ఫీజు లేదు మీరు చేయాల్సిందల్లా జర్నలిష్టు ఐతే చేస్తున్న పత్రిక లేక సోషల్ మీడియా యూట్యూబ్ సంస్థ పేరు, జర్నలిష్టు పేరు,వార్తా కథనం సంస్థఎడిటర్ తో ధృవీకరణ పత్రం అలాగే ఎడిటర్ ఐతే ఆ సంస్థ యజ మాని పేరుతో ధృవీకరణ పత్రం తేది నవంబర్ 3 రోజు సాయంత్రం 5 గంటల్లోపు ఈ 7095026350 వాట్ప్ నంబర్ కు పంపించాలి.యుట్యూబ్ కథనాలు 5 నిమిషాలలోపు ఉండాలి గడువుదాటి పంపిన ఎంట్రీలు పరిశీలించబడవని తెలిపారు.



# కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే డా. సంజయ్

జగిత్యాల అక్టోబర్ 19 (ప్రజా మంటలు) : పట్టణానికి చెందిన ముగ్గురు ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం ద్వారా మంజూరైన మూడు లక్షల రూపాయల విలువగల చెక్కులను జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అందజేసారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్,మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, నాయకులు అడువాల లక్ష్మణ్, కౌన్సిలర్ లు తోట మల్లికార్జున్, పద్మ శేఖర్, రజి, నాయకులు మనాల కిషన్, ధుమాల రాజ్ కుమార్, ప్రభాత్ సింగ్ ఠాగూర్ ,జిలాని, దాసరి ప్రవీణ్, గుమ్ముల అంజయ్య,రాజేశం,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తి బస్టాండ్ ను సుందరీకరణకు మంత్రి పున్నం ప్రభాకర్ ఆదేశాలు



ఎల్కతుర్తి అక్టోబర్ 19 (ప్రజా మంటలు) : మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఎల్కతుర్తి మండలంలోని బస్టాండ్ ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహ ప్రాంగణాన్ని సుందరీ కరణ చేయుట కొరకు ఎల్కతుర్తి ఎమ్మార్వో ఎల్కతుర్తి ఎంపీడీవో మండలానికి సంబంధి చిన అధికారులతో కలిసి సందర్శించి చుట్టుపక్కల ఉన్న షాపులను తీసి వేయాలని పక్కకు మడిపల్లె రోడ్డుకు హనుమకొండ రోడ్డు పార్కు వద్దకు వెళ్లవలసిందిగా షాపు యజమానులందరికీ ఎమ్మార్వో ఆదేశాలు జారీ చేసతు. వచ్చే ఆదివారం 27వ తారీకు వరకు తప్పనిసరిగా ఖాళీ చేయించాలని అధికారులు అధికార పార్టీ నాయకులు కోరడం, దనాయికి షాపు యజమానులంతా ఖాళీ చేస్తామని మాట ఇచ్చారు. వీరి వెంట ఎల్కతుర్తి అధికార పార్టీ నాయకులు ఎల్కాతుర్తి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి మాజీ ప్రెసిడెంట్ సంతాజి ఎల్కాతుర్తి ప్రధాన కార్యదర్శి గొర్రె మహేందర్ ఎల్కతుర్తి అధ్యక్షులు శీలం అనిల్ కుమార్ గోడిశాల రాజు( లడ్డు రాజు) అంబాల స్వామి సీనియర్ నాయకులు పాక రమేష్ రాజకుమార్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# మూసీ పేరుతో లూటీ



- మురకినీటి యంత్రాలను ఉపయోగించడం మేలు
- బండి సంజయ్‌కు గ్రూప్ పరీక్షల గురించి ఎం తెలుసు?
- కేటీఆర్ విమర్శలు
- రైతుభరోసా ఇవ్వనందుకు నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపు

హైదరాబాద్ (ప్రజా మంటలు) : మూసీ పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు రేవంత్ రెడ్డి ప్లాన్ వేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ( విమర్శించారు. రూ.26 వేల కోట్లతో మొత్తం మూసీ పునరుజ్జీవం అవుతుందని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్‌కు మూటలు మోయడానికి రేవంత్ రెడ్డి దొరికాడని చెప్పారు. హైడ్రా పేరుతో బిల్డర్లను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. మూసీ బఫర్ జోన్‌లో ఉన్నవాళ్లను కబ్జాదారులని రేవంత్ ముద్ర వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నాగోల్‌లోని ఎస్టీపీని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కేటీఆర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. నాగోల్‌లో దేశంలోనే అతిపెద్ద మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మించామని చెప్పారు. ఇక్కడ శుద్ధి చేసిన నీళ్లు నల్లగొండ జిల్లాకు పోతాయన్నారు. రేవంత్ రెడ్డి కొత్తగా చేసేదేం లేదన్నారు. ఈ ఎస్టీపీలను సక్రమంగా నడుపుకుంటే చాలన్నారు. మూసీ నది హైదరాబాద్ ఒక వరమని, దానిని మురికి కూపంగా మార్చింది కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలేనని చెప్పారు. హైదరాబాద్‌లో రోజూ 20 కోట్ల లీటర్ల మురికినీరు ఉత్పత్తి అవుతున్నదని తెలిపారు. దక్షిణాసియాలోనే వంద శాతం మురుగు శుద్ధి చేసే నగరం లేదని వెల్లడించారు. మురుగునీటిని వంద శాతం శుద్ధి చేస్తున్నది ఒక్క హైదరాబాద్‌లోనేనని చెప్పారు. కేసీఆర్ హయాంలోనే ఈ ఘనతను సాధించామన్నారు. రూ.3,800 కోట్ల ఖర్చుతో ఎస్టీపీల నిర్మాణం ప్రారంభించామని తెలిపారు. నగరంలోని 54 నాలాల నుంచి మూసీలోకి మురికి నీరు వస్తుందని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన ఎస్టీపీలను రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో 57.7 కిలోమీటర్లు మూసీ ప్రవహిస్తుందన్నారు. మూసీపై 15 చోట్ల బ్రిడ్జిలను నిర్మించాలని ప్రణాళికలు రూపొందించామని వెల్లడించారు. చారిత్రక, వారసత్వ సంపదను కాపాడుతూ ఆధునికంగా నిర్మించాలని నిర్ణయించామన్నారు. బ్రిడ్జిల నిర్మాణానికి రూ.545 కోట్లు మంజూరు చేశామన్నారు. రోడ్ కం బ్రిడ్జ్ కం చెక్ డ్యాం నిర్మించాలనుకున్నామని చెప్పారు. మూసీపై రూ.10 వేల కోట్లతో భారీ స్కై ఓవర్ నిర్మించాలనుకున్నామని తెలిపారు.ఎంత శుద్ధి చేసినా మూసీ నీళ్లు తాగేవి కాదని చెప్పారు. అందువల్ల కొండపోచమ్మ సాగర్ నుంచి మూసీకి నీళ్లు తేవాలని నిర్ణయించామన్నారు. గోదావరి నుంచి నీళ్లు తెచ్చేందుకు రూ.1100 కోట్లతో ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఆ ప్రాజెక్టుకు గతేడాది మే 18న శంకుస్థాపన చేశామని గుర్తుచేశారు. మూసీ పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు రేవంత్ రెడ్డి ఎ÷-లాన్ వేశారని చెప్పారు. రూ.26 వేల కోట్లతో మొత్తం మూసీ పునరుజ్జీవం అవుతుందని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామని చెబుతున్నారని విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్‌కు మూటలు మోయడానికి రేవంత్ రెడ్డి దొరికాడని చెప్పారు. హైడ్రా పేరుతో బిల్డర్లను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మూసీ బఫర్ జోన్‌లో ఉన్నవాళ్లను కబ్జాదారులని రేవంత్ ముద్ర వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి తనను మూసీ వద్ద 3 నెలలు ఉండాలని అంటున్నడు.. 60-70 ఏండ్ల నుంచి ప్రజలు ఇక్కడే ఉంటున్నారని తెలుసుకోవాలన్నారు. మూసీ పక్కన తాను మూడు నెలలు కాదు మూడేండ్లు ఉంటానని స్పష్టం చేశారు. మూసీ తనకు చిన్నప్పటి నుంచి తెలుసని, కొత్తగా రేవంత్ చెప్పాల్సింది లేదన్నారు. సోకుల కోసం పేదలను రోడ్డున పడేయొద్దని ముఖ్యమంత్రికి సూచించారు. రేవంత్ తన కుర్చీ కాపాడుకోవడానికి కావాలంటే చందాలిస్తామన్నారు. 2400 కిలోమీటర్ల పొడవైన నమామి గంగే ప్రాజెక్టు కోసం ప్రధాని మోదీ రూ.40 వేల కోట్లు ఖర్చు చేశారని, మూసీ కోసం రేవంత్ కిలోమీటర్‌కు రూ.2700 కోట్లు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. మూసీకి రెండువైపుల రిటెయినింగ్ వాల్ కట్టాలని సూచించారు. మూసీ మీద ఎక్స్‌ప్రెస్ వే నిర్మించాలని చెప్పారు. అంతకంటే కొత్తగా రేవంత్ రెడ్డి చేయాల్సిందేమీ లేదన్నారు. మూసీ బాధితులకు తామంతా అండగా నిలబడతామని చెప్పారు. మూసీ ప్రాజెక్టుకు డీపీఆర్ లేకుండానే ఇం÷-లడెందుకు కూలగొడుతున్నారని ప్రశ్నించారు. ఇండ్లు ఖాళీ చేయాలని అధికారులు అడిగితే నిలదీయాలని ప్రజలకు సూచించారు. మూసీ పేరుతో జరుగుతున్న లూటీకి చరమగీతం పాడాలన్నారు. నాలా అభివృద్ధి పనుల వల్ల గతంలో మునిగిన కాలనీలు ఇప్పుడు సురక్షితంగా ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి గ్రాఫిక్స్ మాయాజాలానికి మోసపోయిగా ఆగం కావొద్దన్నారు. మూసీలోని మురికి నీరు ఎస్టీపీలో ఎలా శుభ్రం అవుతుందో కేటీఆర్ చూపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీవరేజ్ ఎ÷-లాంట్ల ఏర్పాటును కేటీఆర్ చేపట్టారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. రూ.3800 కోట్లతో 31 ఎస్టీపీల నిర్మాణాన్ని చేపట్టామని వెల్లడించారు. స్వచ్ఛమైన నీరు మూసీలోకి వదలాలని ఈ ఎస్టీపీలను నిర్మిస్తున్నామని తెలిపారు. మూసీపై 15 బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని భావించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మూసీ ప్రాజెక్టుపై డీపీఆర్ లేదని, ఎస్టిమేషన్ లేదని విమర్శించారు. ప్రజలకు ఇబ్బంది పెట్టే చర్యలకు పాల్పడితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. మూసీ పరివాహక ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.

బండి సంజయ్‌కు గ్రూప్ పరీక్షల గురించి ఎం తెలుసు?

గ్రూప్ -1 అభ్యర్థులను రేవంత్ ప్రభుత్వం కనీసం చర్చలకు కూడా పిలవకపోవడం దుర్మార్గమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. గ్రూప్-1 అభ్యర్థులను రేవంత్ ప్రభుత్వం హీనంగా చూస్తోందని అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.... గ్రూప్-1 అభ్యర్థులు ఈ రాష్ట్ర భవిష్యత్తు నిర్మాతలు అని చెప్పారు.కనీసం సుప్రీంకోర్టు ఏదో ఒక నిర్ణయం తీసుకునే వరకైనా ప్రభుత్వం వేచి చూడాలని అన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్, సీఎం రేవంత్ రెడ్డి కావాలనే డ్రామా ఆడుతున్నారని విమర్శించారు.. బండి సంజయ్‌ని పోలీస్ సెక్యూరిటీ ఇచ్చి మరి రేవంత్ ర్యాలీ చేయిస్తాడని అన్నారు. బీఆర్ఎస్ నాయకులను మాత్రమే రేవంత్ ప్రభుత్వం అరెస్ట్ చేస్తుందని మండిపడ్డారు. బండి సంజయ్‌ను చర్చలకు పిలిస్తే ఏం జరుగుతుందని కేటీఆర్ అడిగారు. బండి సంజయ్ ఏం చదువుకున్నాడు? ఆయనకు పరీక్షల గురించి ఏం తెలుస్తుందని ఎద్దేవా చేశారు. పరీక్ష పత్రాలు లీక్ చేయమంటే చేస్తాడు... అభ్యర్థుల తరఫున ఆయనేం చర్చిస్తారని నిలదీశారు. రెండు పంటలకు కాదు మూడు పంటలకు రైతు భరోసా ఇస్తానని రేవంత్ రెడ్డి అనలేదా అని ప్రశ్నించారు. ఇప్పుడు ఒక్క పంట కూడా రైతు భరోసా ఇవ్వకుండా చేతులె త్తేశారని ధ్వజమెత్తారు. మాజీ సీఎం కేసీఆర్ ఈ విషయం గురించి ముందే చెప్పారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నంతవరకే రైతు బంధు అని చెప్పారని అలాగే జరుగుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి రైతు భరోసా ఎందుకు వేయడం లేదని నిలదీశారు. ఆదివారం తెలంగాణ వ్యాప్తంగా రైతు భరోసా ఇవ్వనందుకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రకటించారు. రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ ధర్నాలో పాల్గొనాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# విద్యార్థులందరికి అపార్ నెంబర్




ఇబ్రహీంపట్నం అక్టోబర్ 19 (ప్రజా మంటలు) :

ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కోమటి కొండాపూర్ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల లో జరిగిన తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశంలో విద్యార్థులు అపార్ నెంబర్ పొందడం కొరకు తల్లిదండ్రుల యొక్క సమ్మతి తీసుకోవడం కోసం అంగీకార పత్రాలు ఇచ్చామని ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ, అపార్ ఐడి అనేది 2020 జాతీయ విద్యా విధానం ప్రకారం భారత దేశం లోని విద్యార్థులందరి కోసం రూపొందించిన జీవితకాల ప్రత్యేక 12అంకెల గుర్తింపు వ్యవస్థ ఇది. దీని ద్వార విద్యార్థుల అకాడమిక్ పురోగతిని ట్రాక్ చెయ్యడం, వారి అభ్యసన ప్రయాణంలో వారి విద్యను మరింత సమర్ధవంతంగా నిర్వహించడానికి సహాయపడడం, విద్యార్థులు తమ అకడమిక్ రికార్డులను ఎక్కడి నుండైనా, ఎప్పుడైనా యాక్సెస్ చేసుకోవచ్చు అని తెలిపారు. విద్యార్థులు మైనర్స్ కావడం చేత తల్లిదండ్రుల సమ్మతి కొరకు " సమ్మతి పత్రాలు" అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు సుధారాణి, నర్మద, రాణి మరియు జ్యోష్ణ లు పాల్గొన్నారు.

# సిద్ధాపూర్ గ్రామంలో ఎయిడ్స్ అవగాహన సదస్సు

హసన్పర్తి అక్టోబర్ 19 (ప్రజా మంటలు) :





హసన్పర్తి మండలం సిద్ధాపూర్ గ్రామంలో ఆర్ డి ఎం ఎం సంస్థ వారు సిద్ధపురం లో నిర్వహించినఐ హెచ్ సి మెడికల్ క్యాంప్ లో అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీడి కమ్యూనిటీ పీపుల్ తో మాట్లాడుతూ కమ్యూనిటీ పీపుల్ అందరు ఆరోగ్యంగా ఉండాలని, హెచ్ ఐ వి, ఎయిడ్స్ ల పట్ల జాగ్రత్తగా ఉండాలని చెప్తుతూ అవసరమైన అన్ని ఆరోగ్య పరీక్షలు సంస్థ ద్వారా తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. ప్రతి 3 నెలలకి ఒకసారి ఆర్ ఏ సి పరీక్ష, ప్రతి 6 నెలలకి ఒకసారి ఐసీటీసీ మరియు 3ఆర్ పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. ఇంకా కమ్యూనిటీ పీపుల్ అందరు ఆరోగ్యంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీమతి. జ్యోతి, రామక్రిష్ణ సూపర్వైజర్, సంస్థ సిబ్బంది ఈశ్వర్ ప్రాజెక్టు మేనేజర్, స్వాతి,సరస్వతి, రాధిక, సంస్థ మేనేజర్ పాల్గొన్నారు.

# వయోధికులకు టాస్కా ఆసరా..

## సీనియర్ సిటీజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్

కోరుట్ల అక్టోబర్ 19 (ప్రజా మంటలు) :



సీనియర్ సిటీజన్స్(వయో వృద్ధుల) కోసం మా తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ ఆసరాగా ఉందని, వయోధికుల సంరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేయడం పట్ల తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అస్సోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి,జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.కోరుట్ల డివిజన్ కేంద్రంలోని తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ కోరుట్ల డివిజన్ కార్యాలయంలో వయోధికుల రక్షణ,పోషణ సంక్షేమ చట్టంపై హరి ఆశోక్ కుమార్ వయోధికులకు, వివిధ సంఘాల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. సీనియర్ సిటీజేన్స్ పిలుపు పత్రికలను హరి ఆశోక్ కుమార్ ఆవిష్కరించారు.వయో వృద్ధులు తమను నిరాదరిస్తున్న కొడుకులపై కోరుట్ల డివిజన్ టాస్కా సంఘానికి ఫిర్యాదు చేసిన కేసుల్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. నిరాదరణకు గురైన వయోధికులైన తల్లిదండ్రులు సంబంధించిన రెవెన్యూ డివిజన్ అధికారికి ఫిర్యాదు చేస్తే వారి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఆర్డీవో తీర్పును పాటించక పోతే 3 నుంచి 6 నెలల జైలు శిక్ష విధించే వీలుజిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లాలో ఆర్డీవో లు జగిత్యాల ఆర్డీవో పి.మధుసూదన్, కోరుట్ల,మెట్ పల్లి ఆర్డీవో ఎన్.శ్రీనివాస్ లు వృద్ధుల కేసుల పరిష్కారంలో రాష్ట్రంలోనే నెంబర్ వన్ గా నిలిచారని ఆయన పేర్కొన్నారు.తమ తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అస్సోసియేషన్ రాష్ట్రంలో ప్రభుత్వం గుర్తింపు పొందిన అసోసియేషన్ అంటూ వయో వృద్ధులైన తల్లిదండ్రులకు అండగా ఉంటుందన్నారు. వయోవృద్ధుల చట్టం 2019లో చేసిన సవరణలను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో ఆమోదించాలని ,అందుకు రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు సహకరించాలని ఆయన కోరారు. ఈ అవగాహన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,జిల్లా ఉపాధ్యక్షుడు,కౌన్సెలింగ్ అధికారి పి.సి.హన్మంత్ రెడ్డి,కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం,కార్యదర్శి గంటేడి రాజ్ మోహన్,కోశాధికారి ఎన్.లక్ష్మీ నారాయణలు, ఉపాధ్యక్షుడు ఎం.డి.సైఫోద్దిన్, సంయుక్త కార్యదర్శులు రాజయ్య, సాబితలి, శ్రీరాములు, చిలుక గంగారాం,కతలాపూర్ అధ్యక్షుడు అల్లూరి బాపురెడ్డి,మేడిపల్లి అధ్యక్షుడు ఒద్దినేని గోవర్ధన్ రావు, కార్యదర్శి ఎండి.బురాణోద్దీన్,వివిధ మండలాల, గ్రామాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ధర్మపూరి స్వామిని దర్శించుకొన్న దేవాదాయ సంయుక్త కమీషనర్

ధర్మపురి అక్టోబర్ 19 (ప్రజా మంటలు) :

ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానమునకు దేవాదాయ ధర్మాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమీషనర్ ఎం రామక్రిష్ణారావు కుటుంబ సమేతంగా వచ్చి, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు.వీరికి దేవస్థానం సాంప్రదాయ ప్రకారం మేళతాళాలతో స్వాగతం పలికిన పిదప వేదపండితులు అర్చకులు ఆశీర్వచనం ఇచ్చిన తదుపరి దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ శేష వస్త్రం చిత్రపటం ఇచ్చి సన్మానించారు. కార్యక్రమములో దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ సూపరింటెండెంట్ కిరణ్ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ అర్చకులు నేరెళ్ల విజయ్ సముద్రాల వంశి మరియు అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

# న్యాయం చేయాలని మందు డబ్బులతో తాసిల్దార్ కార్యాలయం బయటాయించిన రైతులు..



గొల్లపెల్లి అక్టోబర్ 19 (ప్రజా మంటలు) :

గొల్లపల్లి మండలం లోని బిబిరాజుపల్లి నుండి రాఘవపట్నం వరకు ఉన్న ఎస్సారెస్పీ కెనాల్ కాలువ పక్కన దారి లేదని గ్రామానికి చెందిన ఓ రైతు ఇబ్బందులకు గురి చేస్తున్నాడని శనివారం తాసిల్దార్ కార్యాలయం ముందుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతులు మాట్లాడుతూ పంట పొలాలకు వెళ్ళడానికి అందరూ కలసి కెనాల్ కాలువ పక్క నుండి దారి ఉండాలని పరిహారం నిమిత్తం గత 20సంవత్సరాల కిందట భూములను ఇచ్చారని, రైతులకు ఇప్పటికీ ఎలాంటి పరిహారం రాకపోవడంతో రైతులలో ఒక రైతు నునుగొప్పుల నరేష్ ప్రస్తుతం వెళ్తున్నదారికే నేను భూమి ఇవ్వలేనని, నిన్న వారి కుటుంబ సభ్యులతో కలిసి తాసిల్దార్ ను కలిసిన సంఘటన విధితమే. నరేష్ నా భూమిలో నుండి ఎవరికీ దారి లేదని, ఎవరు కూడా నడవడానికి వీలు లేదని పక్కన రైతులను నడవనివ్వక మిగతా రైతులు పంట చేతికి వచ్చే సమయంలో ఇప్పుడు దారి లేదని దారిని మూసివేస్తున్న రైతును వెంటనే అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి దారి సమస్య పరిష్కరించాలని రైతులు నినాదాలతో మండల కేంద్రానికి వచ్చారు. కార్యాలయ ఆవరణం ఉద్రిక్తతకు దారి తీయడంతో, విషయం తెలుసుకున్న ఎస్సై చిర్ర సతీష్ సంఘటన స్థలానికి చేరుకొని దీక్షను విరమింప చేశారు. అనంతరం రైతులు గ్రామ ప్రజలు తాసిల్దార్ వరందన్ కు వినతి పత్రం అందజేశారు.





# కోరుట్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద జర్నలిస్టుల ధర్నా

కోరుట్ల అక్టోబర్ 19 (ప్రజా మంటలు) :

ఇల్లెందు మండలంలో జర్నలిస్టు సుదర్శన్ రెడ్డి పై దాడికి నిరసనగా జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద జర్నలిస్టుల ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం జర్నలిస్టు నాయకులు ముక్కెర చంద్రశేఖర్, గంగుల రాంగోపాల్, శికారి రామకృష్ణ, ఆకుల మల్లికార్జున్ లు మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు చేయడం సరికాదని, జర్నలిస్టులు నిరుపేదల సమస్యలపై ఎప్పుడు పోరాటం చేస్తూనే ఉన్నామని వారు పేర్కొన్నారు. దేశంలో జరిగే అక్రమాలపై, అన్యాయాలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి, ప్రజల దృష్టికి తీసుకువచ్చే వాడే జర్నలిస్ట్ అని అలాంటి వారిపై దాడులు చేయడం శోచనీయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక జర్నలిస్టులు పాల్గొన్నారు.



# కొనుగోలు కేంద్రాలలో కావలిసిన అన్నీ వసతులు ఏర్పాటు చేసుకోవాలి

## గడువు తేదీ లోగా సిఎంఆర్ పూర్తి చేయాలి -కలెక్టర్ బి. సత్య ప్రసాద్



జగిత్యాల అక్టోబర్ 19 (ప్రజా మంటలు) :

కలెక్టరెట్ లోని సమావేశ మందిరంలో ఖరీఫ్ 2024-25 సీజన్ కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు, ఖరీఫ్ మరియు రబీ 2023-24 సీజన్ కి సంబంధించి కస్టమ్ మిల్లింగ్ బియ్యం (సిఎంఆర్) డెలివరి పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు రెండు రోజుల్లో ప్రారంభించాలని, కొనుగోలు కేంద్రాలలో కావలిసిన అన్నీ వసతులు ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలని అధికారులని ఆదేశించారు. జిల్లాలో ప్రత్యేకంగా సన్నరకం వరి ధాన్యం కొనుగోలు కొరకు ఏర్పాటు చేసిన 63 కొనుగోలు కేంద్రాలకి ప్రత్యేకంగా వ్యవసాయ విస్తరణ అధికారులని (ఏఈఓ) ట్యాగింగ్ చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులని ఆదేశించారు. సన్నరకం వరి ధాన్యం గుర్తించుటకు డయల్ కాలిపర్ డివైస్ ని వీలైనంత తొందరగా తెప్పించాలని జిల్లా మార్కెటింగ్ అధికారి ని ఆదేశించినారు. అదేవిధంగా ఖరీఫ్ మరియు రభి 2023-24 సీజన్ కి సంబంధించి కస్టమ్ మిల్లింగ్ బియ్యం (సిఎంఆర్) అక్టోబర్ 31, 2024 లోగా ఎఫ్సిఐ కి డెలివరి చేయాలని ఆదేశించారు. సిఎంఆర్ డంపింగ్, పాసింగ్ లో ఎలాంటి జాప్యం లేకుండా తగినన్ని రైల్ వాగన్స్ సమకూర్చుకొని, తగినంత స్టోరేజ్ స్పేస్ సమకూర్చుకోవాలని, ఈ విషయంలో గడువు తేదీ లోగా సిఎంఆర్ పూర్తి అయ్యేవిధంగా ఎఫిసిఐ అధికారులు అన్నీ విధాలుగా సహకరించాలని తెలిపారు.. త్వరితగతిన గడువులోగా సిఎంఆర్ డెలివరీ పూర్తి చేసి, తదుపరి ఖరీఫ్ 2024-25 సీజన్కు సంబంధించి ప్రభుత్వం కొనుగోలు చేసిన వరి ధాన్యం దిగుమతికి సిద్ధంగా ఉండాలని రైస్ మిల్లర్లకి ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. రాంబాబు, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎస్. జితేందర్ రెడ్డి, జిల్లా మేనేజర్, సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్‌ల ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్

గొల్లపల్లి అక్టోబర్ 19 (ప్రజా మంటలు) :
గొల్లపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల మైదానంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా ధర్మపురి సర్కిల్ పోలీస్ ఆధ్వర్యంలో శనివారం వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. పోటీలో 16 ఇట్లు పాల్గొనగా ,సెమీ ఫైనల్ లో 4 జట్లు తలపడగా ఫైనల్లో గొల్లపల్లి వెలగటూర్ తలపడగా గొల్లపెల్లి గెలుపొందింది. గెలుపొందిన జట్లకు బహుమతులను ధర్మపురి సిఐ రామ నరసింహారెడ్డి బహుమతులను ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో ధర్మపురి సిఐ రామ్ నర్సింహారెడ్డి, ఆర్ ఐ రామకృష్ణ, గొల్లపల్లి, ధర్మపురి, బుగ్గారం, వెలగటూర్ ఎస్సైలు సతీష్ మహేష్, శ్రీధర్ రెడ్డి, ఉమా సాగర్, వాలీబాల్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



# కాకతీయ విశ్వవిద్యాలయ నూతన వైస్ ఛాన్సలర్‌గా ఆచార్య కర్నాటి ప్రతాప్ రెడ్డి

హన్మకొండ అక్టోబర్ 19 ( ప్రజా మంటలు) :
కాకతీయ విశ్వవిద్యాలయ నూతన వైస్ ఛాన్సలర్ గా ఆచార్య కర్నాటి ప్రతాప్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి పుష్పగుచ్ఛం తో వైస్ ఛాన్సలర్ ఆచార్య కర్నాటి ప్రతాప్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మాట్లాడుతూ అందరి సహకరంతో కాకతీయ విశ్వవిద్యాలయాన్ని అబివృద్ధి చేద్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు డా బి. రమ, డా సుదర్శన్, డా సుకుమారి, డా ఎం.నవీన్, డా చిర్రా రాజు, పుల్లురి సుధాకర్ తో సహా, పలువురు డీన్ లు, ప్రిన్సిపాల్ లు, విభాగ అధిపతులు, అసోసియేషన్స్ బాధ్యులు, పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అబినందించారు.





# ఉత్సాహంగా సాగిన పోలీస్, ప్రెస్ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్..

## క్రికెట్ మ్యాచ్ ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల అక్టోబర్19 (ప్రజా మంటలు) :
జిల్లా పోలీస్ టీం వర్సెస్ ప్రెస్ టీం ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ ఉత్సాహంగా సాగింది. జిల్లా లోని పోలీస్ పరేడ్ మైదానంలో పోలీస్ వర్సెస్ ప్రెస్ మధ్య నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రారంభించారు.అనంతరం విజేతలకు ఎస్పీ అశోక్ కుమార్ బహుమతులు అందించారు.ఈ యొక్క క్రికెట్ మ్యాచ్ లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ మరియు బెస్ట్ బ్యాట్స్ మెన్ గా ప్రెస్ టీం నుండి మహేష్, బెస్ట్ బౌలర్ గా పోలీస్ టీం నుండి ఎస్ బి ఇన్స్పెక్టర్ఆరీఫ్ అలీ ఖాన్ కి లభించింది.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని నిత్యం బిజీగా ఉండే పోలీసులు, జర్నలిస్టులు కొంత సేపు ఆహ్లాదకరంగా గడిపారు. అని అన్నారు. ప్రెస్, పోలీసుల మధ్య మంచి కోఆర్డినేషన్ ఉండడానికి ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించడం జరిగిందని. ప్రతి సంవత్సరం ఒక సారి ఈ విధంగా క్రికెట్ మ్యాచ్ కండెక్ట్ చేయడం ద్వారా ప్రతి ఒక్కరికీ ఆటవిడుపు తో పాటు మంచి టీమ్ స్పిరిట్ వస్తుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో డీఎస్పీలు రఘునందన్, ఉమ మహేశ్వర్,రంగారెడ్డి, సి.ఐ లు వేణుగోపాల్,కృష్ణ రెడ్డి, ఆరీఫ్ అలీ ఖాన్, , ఆర్ ఐ వేణు, మరియు ఎస్.ఐ లు, పాత్రికేయులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఎల్కాతుర్తి బస్టాండ్ ను సుందరీకరణ చేస్తున్న మంత్రివర్యులు పున్నం ప్రభాకర్

ఎల్కతుర్తి అక్టోబర్ 19 ప్రజా మంటలు
ఎల్కతుర్తి మండలంలోని బస్టాండ్ ఆవరణలో ఉన్న అంబేద్కర్ ప్రాంగణాన్ని సుందరీ కరణ చేయుట కొరకు ఎల్కతుర్తి ఎమ్మార్వో ఎల్కతుర్తి ఎంపీడీవో మండలానికి సంబంధించిన అధికారులచే సందర్శించి చుట్టుపక్కల ఉన్న షాపులను తీసి వేయాలని పక్కకు మడిపల్లె రోడ్డుకు హనుమకొండ రోడ్డు పార్కు వద్దకు వెళ్లవలసిందిగా షాపు యజమానులందరికీ ఎమ్మార్వో ఆదేశాలు జారీ చేయడం జరిగినది వచ్చే ఆదివారం 27వ తారీకు వరకు తప్పనిసరిగా కాలు చేయవలసిందిగా అధికారులు అధికార పార్టీ నాయకులు కోరడం జరిగినది షాపు యజమానులంతా ఖాళీ చేస్తామని మాట ఇవ్వడం జరిగినది వీరి వెంట ఎల్కాతుర్తి అధికార పార్టీ నాయకులు ఎల్కాతుర్తి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి మాజీ ప్రెసిడెంట్ సంతాజి ఎల్కాతుర్తి ప్రధాన కార్యదర్శి గౌర్రె మహేందర్ ఎల్కాతుర్తి అధ్యక్షులు శీలం అనిల్ కుమార్ గోడిశాల రాజు( లడ్డు రాజు) అంబాల స్వామి సీనియర్ నాయకులు పాక రమేష్ రాజకుమార్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# ఏఐటీయూసీ నూతన అధ్యక్షులను సన్మానించిన జిల్లా కమిటీ

కోరుట్ల అక్టోబర్ 19 (ప్రజా మంటలు) :
కోరుట్ల పట్టణంలోని సి ప్రభాకర్ భవనంలో శనివారం ఆల్ ఇండియా తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులులగా ఎన్నికైన, జగిత్యాల జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన సిహెచ్ నాగ నిర్మల, జగిత్యాల జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ఎస్ శ్రావణి లను జిల్లా కమిటీ సన్మానించింది.
ఈ సందర్భంగా అంగన్వాడి రాష్ట్ర అధ్యక్షురాలు మ్యాకాల సాయి ఈశ్వరి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు టేకుమల్ల సమ్మయ్య, సుతారి రాములు, ముక్రమ్, శాంత, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# హిందూ దేవాలయాలపై జరుగుతున్నటువంటి దాడులను అరికట్టాలి

## వి హెచ్ పి కలెక్టర్ కు వినతి

జగిత్యాల అక్టోబర్ 19 (ప్రజా మంటలు) :
విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో హిందూ దేవాలయాలపై జరుగుతున్నటువంటి దాడులను అరికట్టాలని కోరుతూ, జగిత్యాల జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్ లో ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారిని కాలితో తాన్ని ధ్వంసం చేసిన వారిని, అలాగే సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో హనుమాన్ విగ్రహం ముఖం కాళ్లు చేతులు చక్కడం, ఇలాంటి దుశ్చర్యలకు పాలు పడిన వంటి దుండగులను వెంటనే కఠినమైన చర్యలు తీసుకోవాలని, దేవాలయాలపై దాడులను చేస్తున్న వారిని పట్టుకొని కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని పోలీస్ శాఖను కోరారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అధ్యక్షులు బోయిని పద్మాకర్ సహ కార్యదర్శి గాజోజు సంతోష్ కోశాధికారి మామిడాల రాములు జిల్లా బజరంగ్దళ్ సంయోజక్ రోహిత్. నగర అధ్యక్షులు జిట్టవేణి అరుణ్, జైపాల్ బజరంగ్దళ్ నగర సంయోజక్ పాదం మహేందర్, తౌటు రామచందర్, విశ్వ. శ్రీధర్ .భూమేష్ విష్ణు. విగ్నేష్. తేజ. సాయి. పవన్ హిందూ బంధువులు పాల్గొన్నారు.



# చిన్నారుల బోసి నవ్వులతోనే కుటుంబాల్లో ఆనందాలు

## మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి



సికింద్రాబాద్, అక్టోబర్ 19 (ప్రజామంటలు) :
చిన్నారుల బోసి నవ్వులతోనే కుటుంబాల్లో ఆనందం, సంతోషాలు వెల్లివిరుస్తాయని మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి అన్నారు. బీజేపీ ఎస్టీ మోర్చా సీనియర్ నాయకులు సకత్ వాల్ వంశీ కుమార్తె బేబీ వన్షిక మొదటి జన్మదిన వేడుకలు బోయిగూడ పార్థివాడలో ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..తమ సంతానం ఆనందం కన్నా తృప్తి కన్నవారికి మరేం లేదన్నారు. పుట్టిన రోజు జరుపుకుంటున్న బేబీ వన్షిక ను, ప్యారెంట్స్ వంశీ, నేహా దంపతులను ఆశీర్వదించి, కానుకలు అందచేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వై.సురేశ్, అంగముత్తు శ్రీనివాస్, సాయిరామ్, ఎస్ రాజు, గుంటి సత్యనారాయణ, మంచాల గోపి, చంద్రపాల్ రెడ్డి, పిట్ల శ్రీనివాస్, పార్శీ పరమేశ్, బొజ్జ నర్సింగ్ రావు, అబినవ్ గంగారెడ్డి, దాసరి సందీప్ రెడ్డి పాల్గొన్నారు.

# తల్లిదండ్రులను విస్మరిస్తే జైలుకే

## జగిత్యాల ఆర్డీవో మధుసూదన్..



జగిత్యాల అక్టోబర్ 19 (ప్రజా మంటలు) :
వయోవృద్ధులైన కన్న తల్లి,దండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత పిల్లలదే నని విస్మరిస్తే శిక్షార్హులేనని, జైలు శిక్ష, జరిమానా తదితర చట్టపరమైన చర్యలు తప్పవని జగిత్యాల డివిజన్ ఆర్డీవో, వయోవృద్ధుల ట్రిబ్యునల్ చైర్మన్ పి.మధుసూదన్ హెచ్చరించారు.ఆర్డీవో ఛాంబర్లో వయోవృద్ధుల పోషణ,సంరక్షణ చట్టం సెక్షన్ 2(బీ),సెక్షన్ 4(1),సెక్షన్ 24 కింద నమోదు అయిన కేసుల్లో కొడుకులు,కోడళ్ళను, కూతుర్లను ఆర్డీవో ముందు విచారణకు హాజరయ్యారు.విచారణల్లో కోడీమ్యాల మండలం తిప్పాయపల్లె గ్రామానికి చెందిన జెట్టి పెద్ద నర్సయ్య ఆయన కొడుకులు లక్ష్మీ రాజం, రవి, మధు, మనుమలు రజనీకాంత్, వెంకటేష్ లను, గొల్లపల్లి మండలం ధట్నూర్ గ్రామానికి చెందిన దుంపటి రామవ్వ ఫిర్యాదులపై ఆమె కూతుర్లు గంగాధర రాజేశ్వరి,సంఘం విజయ, మనుమడు ఆశోక్ లను ఆర్డీవో విచారించారు. తమ కుమారులనుంచి పోషణ, వైద్య ఖర్చులు,ఆస్తులు తిరిగి ఇప్పించాలనే కేసుల్లో ఆవృద్ధుల తరపున సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ తన వాదనలు ఆర్డీవోకు వినిపించారు. డుకులు, కోడళ్ళకు, మనుమలకు ఆర్డీవో కౌన్సెలింగ్ చేశారు. అనంతరం ఆర్డీవో ఫిర్యాదుదారుల, కొడుకుల, కోడళ్ల, కూతుర్ల, మనుమల వాంగ్మూలాలను విని, సాక్ష్యాధారాలను పరిశీలించారు. అనంతరం సంరక్షణ చట్టం 2007 సెక్షన్ 24 ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రులను పోషించక నిరాధరిస్తు వేధింపులకు గురిచేస్తున్న వారికి,నోటీసులు ఇచ్చినా హాజరు కాని వారికి, తీర్పులు పాటించని వారికి 6 నెలల వరకు జైలు శిక్ష తో పాటు జరిమాన విధించే వీలుందని కొడుకులను, కోడళ్లను ,కూతుర్లను హెచ్చరిస్తూ తల్లిదండ్రుల పోషణకు, సంరక్షణకు ఆర్డీవో ఆదేశించారు. ఈ విచారణ లో సీనియర్ సిటీజేన్స్ జిల్లా కమిటీ అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,కౌన్సెలింగ్ ప్రతినిధులు గౌరిశెట్టివిశ్వనాథం, వెల్మల ప్రకాష్ రావు, సీనియర్ సహాయకులు పద్మజ, ఎఫ్.ఆర్.ఓ.కొండయ్య తదితరులున్నారు.

# నేడు ఫ్రీ మెడికల్ క్యాంపు.. కేంద్రమంత్రి రాక




సికింద్రాబాద్, అక్టోబర్ 19 (ప్రజా మంటలు) :
సికింద్రాబాద్ వారాసిగూడ బ్యాంక్ ఆఫ్ బరోడా దగ్గర ఈ నెల 20 ఆదివారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు సికింద్రాబాద్ బిజెపి సీనియర్ నాయకులు మద్దెర్ల శ్యాంసుందర్ తెలిపారు. ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి జి కిషన్ రెడ్డి హాజరు కానున్నారు. మెడికల్ క్యాంపులో పలు రకాల వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులను కూడా అందచేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# మోడీ విధానాలే కాంగ్రెస్‌కు రక్ష

## పార్లమెంట్ ఎన్నికల నుంచి గుణపాఠం నేర్వని బిజెపి

### ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా ప్రాంతీయపార్టీలు



**న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):**
మోడీ తీసుకున్న కాంగ్రెస్ ముక్త భారత్ నినాదాం పేలవంగా మారింది. ప్రజలు మోడీ పిలుపునకు పెద్దగా స్పందించడం లేదు. అందుకే మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించారు. కేవలం మోడీ హామీలు నినాదాలుగా మారుతున్నాయి. విధానాలు అటకెక్కుతున్నాయి. బిజెపి కన్నా కాంగ్రెస్ మేలన్న వాదన మెల్లగా బలోపేతం అవుతోంది. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో చావుతప్పి కన్నులొట్టబోయిన చందంగా బిజెపి గెలిచింది. దీంతో ఎన్‌డిఎ మిత్రపక్షాల అండతో మోడీ గద్దెనెక్కారు. ఇప్పటికీ మోడీ తన విధానాలు మార్చుకోవడం లేదు. ఈ క్రమంలో ప్రాంతీయ పార్టీలు తేడా వస్తే మోడీని గద్దె దింపడానికి వెనకాడరు. మరోవైపు ప్రాంతీయ పార్టీలకు దర్యాప్తు సంస్థల పనితీరు దేశంలో జీవన్మరణ సమస్యగా మారింది. వివిధ కేసులతో ఆయా పార్టీల నేతలను వేధిస్తున్న తీరు కారణంగా అవి ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి. జార్ఖండ్, ఢిల్లీ ముఖ్యమంత్రులకు ఇడి వేధింపులు ఇందుకు ఉదాహరణగా చూడాలి. ఈ రెండు రాష్ట్రాల్లో అధికారాన్ని చేజిక్కించుకోవడం కోసం ఆమ్ ఆద్మీ పార్టీని, ఆ పార్టీ అధినేత ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను తుదముట్టించడం కోసం బీజేపీ చేయని ప్రయత్నమంటూ లేదు. నిజానికి అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీలో కాంగ్రెస్‌ను దెబ్బతీయడంలో బీజేపీకి సహాయపడ్డారు. పంజాబ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించగలిగారు. ఓ రకంగా కాంగ్రెస్ ముక్త నినాదానికి ప్రయత్నించారు. ఇలా రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ఉనికిలేకుండా చేయగలిగారు. తన సంక్షేమ ఎజెండాయే దేశ వ్యాప్తంగా కాంగ్రెస్‌తో సహా ఇతర పార్టీలు అనుకరించేలా చేయగలిగారు. కాంగ్రెస్ బలహీనపడుతున్న కొద్దీ ఆప్ బలపడింది. అయినప్పటికీ మోదీ సకల ఆయుధాలు కేజ్రీవాల్‌పై ప్రయోగించడంతో ఆయన తన రాజకీయ అస్తిత్వం కోసం పోరాడుతున్నారు. ఆప్ జీవన్మరణ సమస్యలో ఉంది. ప్రాంతీయ పార్టీలు బలహీనపడితే వాటి స్థానంలో బలపడేందుకు కాంగ్రెస్‌కే ఎక్కువ ఆస్కారం ఉన్నది. ఎందుకంటే కాంగ్రెస్ ఓటు బ్యాంకునే ప్రాంతీయ పార్టీలు అధికంగా కొల్లగొట్టాయి. బీజేపీ క్రియాశీలకంగా మారడానికి ముందే ప్రజలు కాంగ్రెస్ పట్ల వ్యతిరేకతతో ప్రాంతీయ పార్టీలను ఆదరించారు. ఇవాళ దేశంలో ఉన్న అనేక ప్రాంతీయ పార్టీల పుట్టుకకు కాంగ్రెస్ అనుసరించిన విధానాలే కారణం. ఇప్పుడు మోదీ కూడా ప్రాంతీయ పార్టీలను బలహీనపరిస్తే చివరకు ప్రధాన పోటీ మళ్లీ బీజేపీ, కాంగ్రెస్‌లకే పరిమితం కావడం ఖాయం. లేదా ప్రాంతీయ పార్టీలె కాంగ్రెస్ గొడుగు కింద బలంగా మారుతాయి. కాంగ్రెస్ ముక్త భారత్ లక్ష్యం సాధించడం కష్టమని గ్రహించినందువల్లే మోదీ ప్రాంతీయ పార్టీలను లక్ష్యంగా పెట్టుకున్నారా? అన్న అనుమానాలకు ఆస్కారం లేకపోలేదు. ఏమైనా అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ మధ్య ప్రాంతీయ పార్టీలు నలిగిపోయే పరిస్థితి పలు రాష్ట్రాల్లో కనిపిస్తోంది. బిజెపి పనితీరు సక్రమంగా లేకపోవడం వల్లనే కర్నాటక, తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. కర్నాకటలో బిజెపి కరప్షన్ కారణంగా ప్రజలను దూరం చేసుకుంది. తెలంగాణలో కెసిఆర్ అహంకారాన్ని అణచివేసేందుకు ప్రజలు కాంగ్రెస్‌ను ఎంచుకున్నారు. లోక్‌సభ ఎన్నికలకోసం మోదీ అవినీతి అంశాలన్ని ఒక ప్రయోగంగా ఉపయోగించుకుంటున్నారా అన్నది చర్చనీయాంశమవుతోంది. 2014లో లోక్‌సభ ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరుకున్న దశలో నరేంద్రమోదీ ఈ దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయాలని పిలుపు ఇచ్చారు. కాని 9 సంవత్సరాల పాలన తర్వాత కూడా ఆయన దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయలేకపోయారు. కర్ణాటకలో బీజేపీ ఘోరపరాజయం చెందిన తర్వాత దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి అవకాశం లేకుండా పోతున్నది. ఇదంతా స్వయంకృతమని తెలంగాణ నిరూపించింది. కర్ణాటకతో పాటు హిమాచల్‌లో కూడా కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగింది. తరవాత తెలంగాణలోనూ కాంగ్రెస్ పాగా వేసింది. ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి, జనసేన కారణంగగా బిజెపి నిలదొక్కుకో గలిగింది. సొంతంగా ఇప్పుడు పోటీ చేసినా ఆ పార్టీకి ఒక్కసీటు కూడా రాదు. కర్ణాటకలో అంతరించిపోయే స్థితిలో జనతాదళ్ (ఎస్) బీజేపీతో చేతులు కలిపింది. నిజానికి కాంగ్రెస్ పార్టీ కంటే మోదీ ప్రాంతీయ పార్టీలను అణిచివేయడంపైనే అధికదృష్టి సారిస్తున్నారే మోనని ఒకరకంగా అనిపిస్తోంది. ఈడీ, సీబీఐలను ప్రయోగించి మహారాష్ట్రలో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ, శివసేనలను బీజేపీ చీల్చగలిగింది. పంజాబ్‌లో అకాలీదళ్‌ను దెబ్బతీసింది. బిహార్‌లో లోక్ జనశక్తిని ముక్కలు చేసింది. నితీశ్ కుమార్‌కు పొమ్మనకుండా పొగపెట్టి పంపించింది. తరవాత మళ్లీ దారికి తెచ్చుకుంది. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి నేతృత్వంలోని బీఎస్పీని బీజేపీ నిర్వీర్యం చేసింది. సమాజ్‌వాది పార్టీని అస్తిత్వం కోసం పోరాడే పరిస్థితిని కల్పించింది. ఒడిషాలో నవీన్ పట్నాయక్ తర్వాత బీజేడీ భవిష్యత్ ఏమిటన్నది ప్రశ్నార్థకమైంది. తాజాగా జార్ఖండ్‌లో కూడా హేమంత్ సోరెన్‌ను వెంటాడుతోంది. దేశంలో అనేక చిన్నా చితక, ఉప ప్రాంతీయ పార్టీలు మోదీ భయంతో బీజేపీతో చేతులు కలపక తప్పడం లేదు. అయితే ప్రజల ఆకాంక్షలకోసం ప్రాంతీయ పార్టీలు ఏర్పడ్డాయో అవి ఆ ఆకాంక్షలను విస్మరించి అధికారాన్ని కొద్ది మంది వ్యక్తుల చేతుల్లో కేంద్రీకృతం అయ్యేలా చూశాయి. అరాచక పాలనతో పాటు, విపరీత అవినీతికి పాల్పడ్డాయి. ఇవాళ ప్రజలు కాంగ్రెస్ వైపో, బీజేపీ వైపో మళ్లుతున్నారంటే అందకు ప్రధాన కారణం ప్రాంతీయ పార్టీల నేతల స్వయం కృతాపరాధాలే అని చెప్పుకోవాల్సిందే. ఈ క్రమంలో బిజెపి తన విధానాలు మార్చుకుంటే తప్ప మరింతగా నిలబడలేదు. ప్రజల్లో ఆందరణ పొందలేదు.

# విద్యుత్ ఛార్జీల నియంత్రణ ఏదీ

## ట్రూ అప్ ఛార్జీలపై పొంతన లేని ప్రకటనలు

**అమరావతి,అక్టోబర్19 (ప్రజా మంటలు):**
విద్యుత్ చార్జీలు నియంత్రిస్తాం, విద్యుత్ బిల్లుల భారం తగిస్తాం అని ఉమ్మడి మేనిఫెస్టో (ఆరవ పేజీలో) హామీనిచ్చి అధికారానికి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం తన మాట నిలబెట్టుకోవాలి. సర్దుబాటు చార్జీలు విద్యుత్ వాడకానికి సంబంధించినవే. అంతకన్నా ముఖ్యంగా రెండున్నరేళ్ల క్రితం వాడిన కరెంటుకు ఇప్పుడు చెల్లించాలనడం దారుణం. కూటమి సర్కారు చార్జీలను నియంత్రించడం కాదు సరికదా మరింత విశృంఖలం గావిస్తున్నది. బిల్లుల భారం తగ్గించడం గాక పెనుభారం మోపుతోంది. ఏలినవారు విజ్ఞతతో యోచించి ప్రతిపాదిత 'సర్దుపోటు'ను ఉపసంహరించడం అందరికీ శ్రేయస్కరం! సర్దుబాటు చార్జీల మూలంగా యూనిట్‌కు రూ.1.27 మాత్రమే భారం పడుతుందని డిస్కాముల వివరణ పత్రం పేర్కొన్నది. రాష్ట్ర వ్యాప్త విద్యుత్ వినియోగం, సర్దుబాటు చార్జీ సగటు లెక్కించి ఆ మొత్తం తేల్చేశారు. కానీ వాస్తవానికి సర్దుబాటు చార్జీలను ఆయా త్రైమాసికాలనుబట్టి, ఆయా డిస్కాములు ఎంత చొప్పున వసూలు చేయవచ్చునో ఇ.ఆర్.సి నిర్ణయిస్తుంది. ఆ ప్రకారం అది ఒక్కో డిస్కాముకు ఒక్కో త్రైమాసికానికి యూనిట్‌కు ఒక్కో విధంగా ఉంటుంది. ఈ మాత్రం లాజిక్ కూడా లేకుండా ప్రజలను మభ్యపుచ్చేందుకు ప్రభుత్వ రంగంలోని డిస్కాములు యత్నించడం దారుణం. అంతేగాక ఇది పేదలకు పెనుభారం. ప్రస్తుతం వున్న టారిఫ్ ప్రకారం రోజుకు ఒక్క యూనిట్ మించకుండా (నెలకు 30 యూనిట్లు) వాడే నిరుపేదలు ఒక్కో యూనిట్‌కు ఇంధన చార్జీగా రూ.1.90, అదే నెలకు 400 యూనిట్లకు పైబడి వాడే సంపన్నులు యూనిట్‌కు రూ. 9.75 చొప్పున చెల్లించాలి. డిస్కాముల వివరణలో పేర్కొన్న సర్దుబాటు రూ.1.27 మాత్రమే అనుకున్నా నిరుపేదల ఇంధన చార్జీకి అదనంగా 67 శాతం చెల్లించాలి. అదే సంపన్నులకు మాత్రం అది 13 శాతమే! మొత్తం విద్యుత్ సంస్కరణల మాటున జరిగేవి ఇలాంటి మాయాజాలాలను ప్రజలు గుర్తించాలి. 11 వేల కోట్లకు పైగా సర్దుబాటు చార్జీ కూడా ఈ వరుసలోనే ఉందని వార్తలొచ్చాయి. అంటే మొత్తం దాదాపు 20 వేల కోట్ల రూపాయలు చెల్లించాలన్నమాట. ఇప్పటికే అధిక ధరలు, తరుగుతున్న ఆదాయాలతో సతమతమవుతున్న ప్రజానీకం పులి మీద పుట్రలా పడిన విద్యుత్ భారాన్ని ఎలా చెల్లించగలం అని ఆందోళన చెందుతున్నారు. జనం గందరగోళ పడుతుండగా ఈ సర్దుబాటు చార్జీలకు ఇప్పటి ప్రభుత్వానికి సంబంధం లేదని డిస్కాములు అక్టోబర్ 1న సుదీర్ఘ వివరణ ఇచ్చాయి. ట్రూ అప్, ఎఫ్‌పిపిసిఎ వంటి పేరుతో ఎప్పుడో వాడుకున్న కరెంటుకు ఇప్పుడు చార్జీ వసూలు చేయడమేమిటి? వాటిని రద్దు చేయండి' అని ప్రజలు చాలా ఏళ్లుగా ఆందోళన చేస్తున్నా పాలకులు వెనక్కు తగ్గడంలేదు. రాష్ట్రంలో ఎవరు అధికారంలోవున్నా ఈ విషయంలో మాత్రం మార్పు లేదు. సర్దుబాటు చార్జీలను నిర్ణయించి, ఆ మొత్తాన్ని వినియోగదార్ల నుండి ఎప్పుడు ఎన్ని వాయిదాల్లో వసూలు చేయాలో ఇఆర్‌సి ఉత్తర్వులిస్తుంది. కాబట్టి ఈ మొత్తం పక్రియ ఒక త్రైమాసికం పూర్తయిన వెంటనే నిర్దిష్ట గడువులోగా పూర్తి కావాలి. అధికారం ఏ పార్టీ చేతిలోవున్నా విద్యుత్ భారాలు, ఆ విధానాలూ అలాగే కొనసాగుతున్నాయి!ఒప్పందాలు కుదుర్చుకున్న ప్లాంట్ల నుండి రాష్ట్రంలో డిమాండ్‌కు తగినంత విద్యుత్ సరఫరా కావడం లేదంటూ ఓపెన్ మార్కెట్‌లో అధిక ధరకు పవర్ ఎక్స్ఛేంజి నుండి డిస్కాములు భారీగా కొనుగోలు చేశాయి. ఇవన్నీ ఆనాటి ప్రభుత్వ పెద్దల ఆదేశానుసారమే జరిగాయన్న విషయం మరువరాదు.

# చేరికలతో జనసేనపై విశ్వాసం పెంచింది

## గ్రామాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం

## జనసేనాని పవన్ కళ్యాణ్ వెల్లడి

**అమరావతి,అక్టోబర్ 19((ప్రజా మంటలు):**
జనసేనలో చేరికలు తమపై విశ్వాసాన్ని మరింత పెంచాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ముద్రగడ క్రాంతి, గుంటూరుకు చెందిన ఇద్దరు కార్పొరేటర్లు, నలుగురు జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిలర్లు పవన్ సమక్షంలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. సామినేని ఉదయభానుపై నమ్మకం ఉంచి ఎన్టీఆర్ జిల్లా బాధ్యతలు అప్పగించినట్టు తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అభివృద్ధికి బాటలు పడ్డాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పంచాయతీరాజ్‌శాఖ పనిచేస్తోంది. అవినీతికి ఆస్కారంలేకుండా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రూపాయి లంచం లేకుండా, ఎవరి సిఫారసులు లేకుండా బదిలీలు జరిగాయి. కూటమి ఎమ్మెల్యేలు సిఫారసు చేసినా క్షుణ్ణంగా పరిశీలించి బదిలీలు చేశాం. లంచం అనే పదం వినిపిస్తే కార్యాలయం నుంచి వెళ్లిపోవాల్సిందే. గుడివాడ ప్రాంతంలో తాగునీటి సమస్య ఉందని మా దృష్టికి రాగానే చర్యలు చేపట్టాం. ఫిల్టర్ బెడ్లు శుభ్రం చేసి.. నీటి పరీక్షలు నిర్వహించాం. నిధులు మంజూరు చేశాం. ప్రజలకు కావాల్సిన కనీస అవసరాలు తీర్చటం కోసం సిద్ధంగా ఉన్నాం' అని పవన్ కల్యాణ్ తెలిపారు.



# ప్రమాదాల్లో బలవుతున్న అమాయక ప్రజలు

**హైదరాబాద్,అక్టోబర్19(ప్రజా మంటలు):**
రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు అనేక చర్యలు తీసుకుంటున్న ప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. నిత్యం రహదారులు నెత్తురోడుతున్నాయి. దీనికితోడు ట్రాఫిక్ ఫ్రీగా నగరం లేకుండా పోయింది. రాంగ్ రూట్ డ్రైవింగ్ సాగుతోంది. ఇకపోతే వరుసగా జరుగుతున్న ప్రమాదాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వాహనాలతో ఢీకొట్టి ఆపై ఆపకుండా పరారవుతున్న ఘటనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఈ కారణంగా అనేక మంది అమాయక ప్రజలు బలవుతున్న పరిస్థితి. ప్రమాద దృశ్యాలు సీసీ టీవీ ఫుటేజ్‌లో రికార్డ్ అవుతున్నాయి. అయినా వాహనదారుల్లో మార్పు రావడం లేదు. ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నా..పట్టించుకోవడం లేదు.

# కలకలం రేపుతున్న విమానాలకు బాంబు బెదరింపులు

## ఒక్కరోజే 20 విమానాలకు బెదిరింపులు

**న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):**
దేశంలో విమానాలకు వరుసగా బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపుతోంది. తాజాగా శనివారం తెల్లవారుజాము నుంచి 20కి పైగా విమానాలకు బెదిరింపులు రావడం గమనార్హం. దీంతో అప్రమత్తమైన అధికారులు విమానాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు, పేలుడు పదార్థాలు లభించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇండిగోకు చెందిన ఐదు, ఆకాశ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఐదు, విస్తారాకు చెందిన మూడు విమానాలతో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, స్పైస్‌జెట్, స్టార్ ఎయిర్, అలయన్స్ ఎయిర్ విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. దిల్లీ నుంచి లండన్ బయల్దేరిన విస్తారా విమానానికి బెదిరింపులు రావడంతో దాన్ని జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌కు దారిమళ్లించారు. ఇక, పారిస్-హాంకాంగ్, దిల్లీ-పారిస్ విస్తారా విమానాలకు కూడా ఈ తరహా బెదిరింపులు రాగా.. వాటిని అత్యవసరంగా దించేశారు. ముంబయి-ఇస్తాంబుల్, దిల్లీ-ఇస్తాంబుల్, జోధ్‌పుర్-దిల్లీ, హైదరాబాద్-చండీగఢ్, జెడ్డా-ముంబయి ఇండిగో విమానాలకు ఈ ఉదయం బెదిరింపులు వచ్చాయి. వీటిల్లో కొన్నింటిని అత్యవసరంగా ల్యాండ్ చేశారు. మరికొన్నింటి టేకాఫ్‌ను ఆపేసి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. ఈ పరిణామాలపై ఇండిగో స్పందించింది. ప్రయాణికుల భద్రతే తమకు అత్యధిక ప్రాధాన్యం అని, దీనిపై సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. దుబాయ్ నుంచి జైపుర్‌కు వచ్చిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ (ఎచీ 196) విమానానికి బెదిరింపులు రావడంతో దాన్ని జైపుర్‌లో అత్యవసరంగా దించేశారు. బెంగళూరు నుంచి ముంబయికి వెళ్లేందుకు టేకాఫ్‌కు సిద్ధమైన ఆకాశ ఎయిర్‌లైన్స్ విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. అప్రమత్తమైన అధికారులు ప్రయాణికులను విమానం నుంచి దింపి క్షుణ్ణంగా పరిశీలించారు. తర్వాత అది నకిలీ బెదిరింపుగా తేలింది. దీంతో పాటు ఈ సంస్థకు చెందిన మరో నాలుగు విమానాలకు కూడా బెదిరింపులు వచ్చాయి. గడిచిన వారం రోజుల్లో దాదాపు 70కి పైగా విమానాలకు ఇంటువంటి నకిలీ బాంబు బెదిరింపులు రావడం తీవ్ర ఆందోళన కలిగించే అంశం. ఈ వరుస బాంబు బెదిరింపులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ బెదిరింపులను నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది. అందులో భాగంగా బాంబు బెదిరింపులకు పాల్పడే వ్యక్తులపై నిషేధం విధించే అవకాశం ఉందని పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఇటీవల తెలిపారు. అదేవిధంగా ఇప్పటికే ఉన్న నిబంధనల్లో మార్పులు చేయాల్సి ఉందన్నారు.

# అది చిరుత కాదు..అడవి పిల్లి

## మియాపూర్ చిరుత సంచారంపై వివరణ

**హైదరాబాద్, (ప్రజా మంటలు):**
మియాపూర్‌లో చిరుత పులి సంచారం అంటూ జరిగిన ప్రచారంలో వాస్తవం లేదని తేలింది. స్థానిక మెట్రో స్టేషన్ వద్ద చిరుత సంచరిస్తోందని శుక్రవారం నుంచి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. ఇందుకు సంబంధించిన ఓ వీడియో కూడా వైరల్ అయింది. దీంతో శనివారం ఉదయం అటవీశాఖ అధికారులు మెట్రో స్టేషన్ సమీపంలోని నడిగడ్డ తండా వద్దకు చేరుకుని ఆ ప్రాంతమంతా పరిశీలించారు. పాదముద్రలు గుర్తించి... ఆ ప్రాంతంలో సంచరించింది అడవి పిల్లి అని నిర్ధరించారు. ఈ ప్రాంతంలో చిరుత ఆనవాళ్లు లేవని అధికారులు స్పష్టం చేశారు. ప్రజలు భయాందోళనకు గురికావొద్దని సూచించారు.

# అంబర్‌పేటలో వృద్ధ దంపతుల దారుణ హత్య

## ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

**హైదరాబాద్, (ప్రజా మంటలు):**
అంబర్‌పేట సాయిబాబా నగర్ కాలనీలో వృద్ధ దంపతులు దారుణహత్యకు గురైన ఘటన కలకలం రేపింది. మూడంతస్తుల భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంటున్న వృద్ధ దంపతులు లింగారెడ్డి, ఊర్మిళాదేవిని గుర్తు తెలియని దుండగులు దారుణంగా హత్య చేశారు. తలపై బాది, గొంతు కోసి కిరాతకంగా హతమార్చినట్టు పోలీసులు గుర్తించారు. దొంగతనానికి వచ్చిన దుండగులే దంపతులను హత్య చేసి ఉంటారని, మూడు రోజుల క్రితం ఘటన జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు.

# గుర్లతో తగ్గుముఖం పట్టిన అతిసార

## వివిధ ఆస్పత్రల్లో కోలుకుంటున్న బాధితులు: మంత్రి

**విజయనగరం,అక్టోబర్ 19(ప్రజా మంటలు):**
విజయనగరం జిల్లా గుర్లలో అతిసారం తగ్గుముఖం పట్టిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం ఆస్పత్రుల్లో 41 మంది బాధితులు ఉన్నారని, మిగతావారంతా పూర్తిగా కోలుకున్నారని పేర్కొన్నారు. భూగర్భ జలాల కలుషితం వల్లే అతిసారం వ్యాప్తి చెందినట్లు మంత్రి వివరించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'గుర్లలో క్లోరినేషన్ పనులు చేపట్టాం. ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తున్నాం. గత ప్రభుత్వ వైఫల్యమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. ఐదేళ్లలో పారిశుద్ధ్యాన్ని, తాగునీటి వ్యవస్థను పట్టించుకోలేదు. జలజీవన్ పథకం నిధులను దారి మళ్లించారు' అని విమర్శించారు. గుర్లలో డయేరియా వ్యాప్తి చెందడంతో ఇప్పటి వరకు ఏడుగురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

# పోలీస్ కస్టడీకి మాజీ ఎంపి నందిగం సురేశ్

**మంగళగిరి,అక్టోబర్ 19(ప్రజా మంటలు):**
వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పోలీసు కస్టడీకి తరలించారు. వెలగపూడిలో మరియమ్మ అనే మహిళ హత్య కేసులో నందిగం సురేష్ నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో రిమాండ్ ఖైదీగా గుంటూరు జైలులో ఉన్న సురేష్‌ను కస్టడీకి ఇవ్వాలని తుళ్లూరు పోలీసులు పిటిషన్ వేయగా.. మంగళగిరి కోర్టు అనుమతించింది. దీంతో తుళ్లూరు పోలీసులు నందిగం సురేష్‌ను గుంటూరు జిల్లా జైలు నుంచి తుళ్లూరుకు తరలించారు. తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో రెండు రోజులపాటు నందిగం సురేష్‌ను పోలీసులు విచారించనున్నారు. అనంతరం సోమవారం మధ్యాహ్నంలోపు గుంటూరు జిల్లా జైలుకు తరలిస్తారు.

# ముత్యాలమ్మ ఆలయ ధ్వంసంపై ఆగ్రహం

## హిందూ సంఘాల ఆందోళనతో ఉద్రిక్తత

**హైదరాబాద్, (ప్రజా మంటలు):**
సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయాన్ని ధ్వంసం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన నిరసనలు ఉద్రిక్తతకు దారి తీశాయి. హిందూ సంఘాల కార్యకర్తలు పదుల సంఖ్యలో ఆలయ పరిసరాల్లోకి చేరుకుని నిరసనలు తెలిపారు. ఆలయం వెనుక ఉన్న మసీదు వైపు హిందూ సంఘాలు కదులుతుండగా.. మత ఘర్షణలు చెలరేగే ప్రమాదం ఉందనే భయాల నడుమ పోలీసులు లాఠీలు ఝుళిపించారు. 1.తూణలాఠీ ఛార్జ్ తో ఆందోళన మరింతగా పెరిగింది. పదుల సంఖ్యలో హిందూ కార్యకర్తలు గాయపడ్డారు. పోలీసుల తీరును నిరసిస్తూ హిందూ ధార్మిక సంఘాల నేతలు భారీగా ఆలయ పరిసరాలకు చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు ఆందోళనకారులకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. హిందూ సంఘాల కార్యకర్తలు, పోలీసుల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. ర్యాలీని అడ్డుకున్న పోలీసులపైకి కార్యకర్తలు చెప్పులు, కుర్చీలు, వాటర్ ప్యాకెట్లు విసిరారు. పోలీసులు దొరికిన వారిని దొరికినట్లు చితకబాదారు. తమను అడ్డుకుంటున్న పోలీసులపైకి కొందరు చెప్పులు విసురుతున్నారు. లాఠీ ఛార్జ్‌లో పలువురి తలలకు తీవ్రంగా గాయాలయ్యాయి. లాఠీ ఛార్జ్‌లో ఎడమ చెయ్యి విరిగి దుర్గ అనే యువకుడు కుప్పకూలాడు. విషయం తెలుసుకున్న డీసీపీ రష్మీ పెరుమాల్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న హిందూ కార్యకర్తలకు నచ్చజెబుతున్నారు. పోలీసుల వైఖరికి వ్యతిరేకంగా నేతలు, కార్యకర్తలు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తున్నారు. మరోవైపు మతఘర్షణలు చెలరేగకుండా సికింద్రాబాద్ పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేసినట్లు సమాచారం.

# వైకాపా హయాంలో పక్కదారి పట్టిన నిధులు

## బాధ్యతలు చేపట్టిన భాజపా నేత లంకా దినకర్



**విజయవాడ,అక్టోబర్ 19(ప్రజా మంటలు):**
గత ఐదేళ్లలో వైకాపా హయాంలో కేంద్ర నిధులు పక్కదారి పట్టించారని భాజపా నేత లంకా దినకర్ విమర్శించారు. 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. స్వర్ణాంధ్ర సాధనకు అందరం కలిసి కృషి చేస్తామన్నారు. 20 సూత్రాలు అందరికీ తెలిసేలా అన్ని కలెక్టరేట్ల వద్ద ఉంచుతామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా రాష్ట్రానికి సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు వెంట తామంతా నడుస్తామని చెప్పారు. అర్హులైన అందరికీ పథకాలు అందించేందుకు సీఎం కృషి చేస్తున్నారని వివరించారు. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా డబుల్ ఇంజిన్ సర్కారు పనిచేస్తోందని లంకా దినకర్ తెలిపారు.

DIGITALLY PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AT 6-3-144, bRAHMAN WADA, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com